1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN

సంపుటి : 3 సంచిక : 101 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 16 ఏప్రిల్ 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 101 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Thursday 16 April 2026 PAGES : 8 PRICE : 3/-

## నాపై నమ్మకంతో మరోసారి పదవి అప్పగించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు: పల్లా శ్రీనివాసరావు



**టీడీపీ ఏపీ అధ్యక్షుడిగా రెండోసారి పల్లా శ్రీనివాసరావు నియామకం**

**సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన పల్లా**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 15)

తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు మరోసారి నియమితుడయ్యారు. తనపై నమ్మకంతో రెండోసారి ఈ కీలక బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబుకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో, పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన అమరావతి నుంచి ఒక పత్రికా ▶మిగతా 2లో

## పాకిస్థాన్‌కు అప్పులోళ్ల బాధ... వెంటబడుతున్న గల్ఫ్ దేశాలు!



**3 బిలియన్ డాలర్ల రుణాన్ని తిరిగి చెల్లించాలని పాకిస్థాన్‌పై యూఏఈ ఒత్తిడి**

**పాకిస్థాన్ పట్ల సహనం కోల్పోతున్న గల్ఫ్ దేశాలు, చైనా**

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 15)

తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్థాన్‌కు మిత్ర దేశాల నుంచి కూడా ఒత్తిడి పెరుగుతోంది. ముఖ్యంగా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తమకు చెల్లించాల్సిన 3 బిలియన్ డాలర్ల రుణాన్ని పునరుద్ధరించేందుకు (రోలోవర్) నిరాకరించింది. గడువు ముగిసిన ఈ అప్పును వెంటనే తిరిగి చెల్లించాల్సిందేనని ఇటీవలే హెచ్చరించడం తెలిసిందే. అదేబాటలో పలు ▶మిగతా 2లో

## చంద్రగిరిలో నారా రామ్మూర్తినాయుడు స్పోర్ట్స్ సెంటర్ ను ప్రారంభించిన మంత్రి లోకేశ్

**చంద్రగిరిలో క్రీడా సంబరం**

**సీఎం చదివిన బడిలో క్రీడా వికాస కేంద్రం**

**రూ.3.17 కోట్లతో క్రీడా కేంద్రం**

**మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ప్రారంభం**

**పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్‌తో కలిసి బ్యాడ్మింటన్ ఆడిన లోకేశ్**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 15)

తిరుపతి జిల్లా చంద్రగిరిలో క్రీడా సంబరం నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, దివంగత నారా రామ్మూర్తినాయుడు స్మారకార్థం నిర్మించిన క్రీడా వికాస కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం ఘనంగా ప్రారంభించారు. చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ప్రారంభించిన లోకేశ్... ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్‌తో కలిసి కాసేపు బ్యాడ్మింటన్ ఆడి సందడి చేశారు.



కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేశ్ కు హాకీ క్రీడాకారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన నారా రామ్మూర్తినాయుడు మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాంగణంలోని క్రీడా సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులతో టేబుల్ టెన్నిస్, హాకీ ఆడుతూ ▶మిగతా 2లో

# టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్..

## కమిటీలలో సామాన్యులకు పెద్దపీట

- టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్ నియామకం
- పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించిన టీడీపీ
- కమిటీల కూర్పులో బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట
- పొలిట్‌బ్యూరోలో సామాన్య కార్యకర్తలకు చోటు కల్పించిన అధిష్ఠానం
- మహిళలకు, యువతకు ప్రాధాన్యతనిస్తూ నూతన కమిటీల ఏర్పాటు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 15)

తెలుగుదేశం పార్టీలో నూతన నాయకత్వానికి, కొత్త సమీకరణాలకు అధిష్ఠానం శ్రీకారం చుట్టింది. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించింది. ఈ పునర్వ్యవస్థీకరణలో అత్యంత ముఖ్యమైన నిర్ణయంగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను నియమించారు. ఈ మేరకు టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీనియర్ల అనుభవానికి, యువత ఉత్సాహానికి సమ ప్రాధాన్యం ఇస్తూ, సామాజిక కోణంలో కమిటీలను కూర్పు చేసినట్లు ఆయన తెలిపారు.

టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు అన్ని సమీకరణాలను బేరీజు వేసుకుని ఈ కసరత్తు చేశారని పల్లా పేర్కొన్నారు. 29 మందితో పొలిట్‌బ్యూరో, ▶మిగతా 2లో

## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు.. ఐదుగురి మృతి... 12 మంది పరిస్థితి విషమం



- ▶సత్యసాయి జిల్లా కదిరిలో భారీ పేలుడు
- ▶డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఘటన
- ▶ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి
- ▶20 మందికి తీవ్ర గాయాలు ▶మిగతా 2లో

## ఈ 9 పనులు చేస్తామని మాటివ్వండి: మోదీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 15)

ఇంటర్నెట్ డెస్క్: ప్రధాని నరేంద్ర మోదీ కర్ణాటకలోని ఆదిచుంచనగిరి మఠాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 9 పనుల గురించి మోదీ హామీ తీసుకున్నారు."మీ నుంచి నాకు తొమ్మిది హామీలు కావాలి. వికసిత్ కర్ణాటక కోసం మీరంతా నాకు వాటిపై ప్రమాణం చేయండి. ఈ ప్రమాణాలను శ్రద్ధగా, నిజాయతీగా పాటిస్తే కర్ణాటకతో పాటు దేశ అభివృద్ధి వేగంగా జరుగుతుంది" అని మోదీ వెల్లడించారు. ప్రధాని అడిగిన హామీలు ఏంటంటే..



- నీళ్లను వృథా చేయకుండా పొదుపుగా వాడదాం.
- పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటిద్దాం
- అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం.
- 'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను చాటి చెబుదాం.
- జాతీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేద్దాం.
- రసాయనాలు లేకుండా పంట సాగు చేద్దాం.
- ఆహారంలో మిల్లెట్స్‌ని భాగం చేసుకుందాం.
- నూనె పదార్థాలను పూర్తిగా తగ్గిద్దాం.
- ఫిట్‌గా, బరువుని అదుపులో ఉంచుతూ, ప్రకృతికి సేవ చేద్దాం

ఇక, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని గుర్తుచేశారు.

## ఇరాన్‌తో మళ్లీ చర్చలు.. అమెరికా 2 షరతులు..



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 15)

పశ్చిమాసియాలో యుద్ధం ముగించే విషయమై అమెరికా-ఇరాన్ మరోసారి శాంతి చర్చలకు సిద్ధమవుతున్నాయి. రెండు రోజుల్లో ఈ సంప్రదింపులు జరగొచ్చని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రకటించారు. అయితే, ఈసారి చర్చల కోసం ఇరాన్‌కు అమెరికా రెండు షరతులు విధించినట్లు తెలుస్తోంది. ఇందులో ఒకటి హర్మూజ్ జలసంధికి సంబంధించినదేనని సమాచారం. ఈ మేరకు అమెరికా దౌత్య వర్గాలను ఉటంకిస్తూ ఇజ్రాయెల్ మీడియా కథనం వెల్లడించింది."రెండో దఫా చర్చల ప్రారంభానికి ముందు అమెరికా రెండు షరతులు పెట్టింది. హర్మూజ్ జలసంధిలో ఎలాంటి ఆంక్షలు లేకుండా దాన్ని పూర్తిగా తెరవాలి. చర్చలకు వచ్చే ఇరాన్ ప్రతినిధులు ఒప్పందంపై నిర్ణయం తీసుకోవడానికి వీలుగా ఐఆర్‌జీసీ నుంచి అనుమతులు తెచ్చుకోవాలి. ఈ రెండు నిబంధనలకు టెహ్రాన్ అంగీకరిస్తే శాంతి చర్చలకు తాము సిద్ధమేనని అమెరికా తెలిపింది" అని సదరు మీడియా కథనం పేర్కొంది.

అయితే, దీనిపై అమెరికా, ఇరాన్ నుంచి అధికారిక ప్రకటనేదీ రాలేదు.ఇదిలాఉండగా.. శాంతి చర్చ లకు సంబంధించి ఇరాన్ పాలకవర్గంలో విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. చర్చల సమయంలో అమెరికా అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు ఇరాన్ ప్రతినిధుల బృందానికి ఐఆర్‌జీసీ అనుమతి నివ్వలేదని సమాచారం. దీనిపై ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ అసంతృప్తిగా ఉన్నట్లు సదరు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ కారణంగానే డీల్ కోసం ఐఆర్‌జీసీ అనుమతి ▶మిగతా 2లో

## జర్నలిస్టుగా పనిచేసిన శ్రీహరి ఏమైనా ఉగ్రవాదా?: సజ్జల

**పూడి శ్రీహరి అరెస్టును ఖండించిన సజ్జల**

**సివిల్ డ్రెస్సులో వచ్చి అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపాటు**

**సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరిస్తున్నారని విమర్శ**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 15)

వైసీపీ ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరి అరెస్టును ఆ పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రంగా ఖండించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ చంద్రబాబు అండ్ కో చెప్పినట్లుగా నడుచుకుంటోందని విమర్శించారు.పూడి శ్రీహరి అరెస్ట్ తీరుపై సజ్జల పలు ప్రశ్నలు సంధించారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా, సివిల్ డ్రెస్సులో వచ్చి అక్రమంగా నిర్బంధించడం ఏంటని పోలీసులను నిలదీశారు. ▶మిగతా 2లో

## సత్యసాయి జిల్లా పేలుడు ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

**జిలెటిన్ స్టిక్స్, గ్యాస్ సిలిండర్లు పేలిన ఘటనలో ఐదుగురు మృతి**

**మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేసిన జగన్**

**పేలుడు పదార్థాల నిల్వపై కట్టుదిట్టమైన నిఘా ఉండాలని సూచన**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 15)

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో జరిగిన ఘోర ప్రమాదంపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిలెటిన్ స్టిక్స్, గ్యాస్ సిలిండర్లు ▶మిగతా 2లో

## భాగ్యనగర్‌లో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం పై అభివృద్ధి కమిటీతో సమావేశమైన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15) ప్రజలందరి సహకారంతో ఒంగోలు నగరాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు తెలిపారు. 20వ డివిజన్ భాగ్యనగర్ నందు జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి టీడీపీ నాయకులు పసుపులేటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. డివిజన్ నందు నూతనంగా ఏర్పాటు చేయనున్న నూతన వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం పై స్థానిక ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రజానికానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌కు విన్నవించారు. అనంతరం దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్మాణం చేపడతామని అన్నారు. ఇప్పటికే అన్ని డివిజన్ల నందు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రజలందరూ నగర అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకటరావు, టీడీపీ నాయకులు మంత్రి శ్రీనివాసరావు, నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్, మలెంపాటి కృష్ణారావు, కేసన శేషమ్మ, వెంకట్, సెగ్గెం శ్రీనివాసరావు, ఈదర సురేష్, మారుతీరావు, గణేష్, అసిస్టెంట్ కమిషనర్ భూపాల్‌రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ ఏసయ్య, తదితరులు పాల్గొన్నారు.


## పోషితభారత్-జంక్ ఫుడ్ రహిత సమాజం అంశం పై అవగాహన



(షణ్ముఖ వెలుగు, పామూరు, ఏప్రిల్ 15)

మండలంలోని డివి పల్లి అంగనవాడి కేంద్రం నందు 8వ పోషణ పక్వాడా పక్షోత్సవాలలో భాగంగా "పోషితభారత్-జంక్ ఫుడ్ రహిత సమాజం" అంశం పై అవగాహన కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవిఎస్ పార్వతి అధ్యక్షతన జరిగింది. పార్వతి మాట్లాడుతూ జంక్ ఫుడ్ లో పోషక విలువలు చాలా తక్కువగా ఉండి కొవ్వు, చక్కెర, ఉప్పు ఎక్కువగా ఉండి ప్రాసెస్ చేసిన ఆహారమని, వీటిలో అనేక రకాలు ఉన్నాయని, వీటిని 0-6 సంవత్సరం పిల్లలు, గర్భిణీలు, బాలింతలు తింటే ఊబకాయం, గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్, కిడ్నీ సమస్యలు, డిప్రెషన్ వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయని, వాటికి దూరంగా ఉండి మనకు స్థానికంగా లభించే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పాలు, గుడ్లు, పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలతో ఇంటి వద్ద వండిన పోషకాహారాన్ని తీసుకోవడం వలన పోషకాహార లోపం లేని, ఆరోగ్యకరమైన పౌరులు కలిగిన భారతదేశాన్ని నిర్మించవచ్చునన్నారు. కేంద్రంలో సాంప్రదాయ చిరుతిళ్లు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాలతో తయారు చేసిన పోషక పదార్థాలను ప్రదర్శించిరి. ఐటిసి ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్ వెంకట్రావు మాట్లాడుతూ0-6 సంవత్సరం పిల్లలు అతిఎక్కువగా సెల్ఫోన్, టీవీ చూడటం వల్ల పిల్లల ప్రారంభ అభివృద్ధిని దెబ్బతీస్తుందని, జ్ఞానాత్మక, సామాజిక, భావోద్వేగ, శారీరక భాషాభివృద్ధి కుంటుపడుతుందని, మాటలు ఆలస్యంగా రావడం, ఊహాశక్తిని కోల్పోతారని, తాతయ్య అమ్మమ్మలతో సమయం గడపనివ్వాలని కథలు పంచుకోవడం ద్వారా పిల్లల భవిష్యత్తు బంగారుమవుతుందన్నారు. తదుపరి పోషణ పక్వాడ పై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించిరి. కార్యక్రమంలో ఐటిసి ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్ వెంకట్రావు, అంగన్వాడీ కార్యకర్తలు ఫణి కుమారి, రజియా బేగం, కృష్ణవేణి, ఖాజాబీ, హెల్పర్స్ మల్లేశ్వరి, రజమున్నిసా బేగం, గ్రామంలోని గర్భిణీ స్త్రీలు, బాలింతలు, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

## చిన్నగంజాంలో గ్రామసభ



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 15) గ్రామాల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎంపిడిఓ కె.ధనలక్ష్మి అన్నారు. మండలంలోని చిన్నగంజాం గ్రామంలో బుధవారం గ్రామ ప్రత్యేక అధికారి,ఎంపిడిఓ కె.ధనలక్ష్మి అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. ఇ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గోని తమ సమస్యలను సెక్రటరీ, ప్రత్యేక అధికారి ఎంపిడిఓ కె.ధనలక్ష్మికి వివరించారు. గ్రామస్తుల సమస్యలు విని వాటి పరిష్కారానికి చర్యలు తిసుకోనున్నట్లు ఎంపిడిఓ తెలిపారు. ఇ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## చంద్రగిరిలో నారా రామ్మూర్తినాయుడు స్పోర్ట్స్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి లోకేశ్

వారిలో ఉత్సాహం నింపారు. వారితో కలిసి ఫోటోలు దిగారు.సీఎం చంద్రబాబు విద్యాభ్యాసం చేసిన చంద్రగిరి బాలుర ఉన్నత పాఠశాలలో రూ.3.17 కోట్ల వ్యయంతో ఈ క్రీడా వికాస కేంద్రాన్ని అభివృద్ధి చేశారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించుకునేందుకు వీలుగా దీన్ని తీర్చిదిద్దారు. 2017లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం ఈ కేంద్రాన్ని మంజూరు చేయగా, గత ప్రభుత్వ హయాంలో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. తాజాగా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రత్యేక చొరవ తీసుకుని పనులు పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చింది.ఈ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చెస్, స్కిప్పింగ్, యోగా, జిమ్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. అలాగే అవుట్‌డోర్‌లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు ప్రత్యేక హాకీ మైదానాన్ని కూడా సిద్ధం చేశారు. చంద్రగిరి, పరిసర ప్రాంతాల యువ క్రీడాకారుల శిక్షణ, అభివృద్ధికి ఈ కేంద్రం ఒక వేదికగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీ రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సి.షణ్ముగ రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చంద్రగిరి నియోజకవర్గ పరిశీలకుడు డాక్టర్ శ్రీపతి బాబు, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, దండు పూజ, భారత హాకీ క్రీడాకారిణి రజని ఇటిమరపు తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్‌తో మళ్లీ చర్చలు.. అమెరికా 2 షరతులు..

తీసుకోవాలని అమెరికా రెండో షరతు పెట్టినట్లు తెలిపాయి.పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ వేదికగా ఇటీవల అమెరికా-ఇరాన్ మధ్య జరిగిన చర్చలు విఫలమైన సంగతి తెలిసిందే. ఆ వెంటనే హర్మూజ్ జలసంధిని అమెరికా దిగ్బంధించడంతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, రెండోదఫా చర్చల కోసం ఇరాన్‌కు చెందిన సరైన వ్యక్తుల నుంచి తమకు ఫోన్ వచ్చిందని ట్రంప్ తాజాగా వెల్లడించారు. అందుకు తాము కూడా సుముఖంగానే ఉన్నట్లు తెలిపారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఆలోపే చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని ఇరుపక్షాలు కోరుకుంటున్నట్లు తెలుస్తోంది.

## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు.. ఐదుగురి మృతి... 12 మంది పరిస్థితి విషమం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 15)

శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. కదిరి మండలంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఐదుగురు మృతి చెందారు. ఈ ఘోర ప్రమాదంలో మరో 20 మంది గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది. వివరాల్లోకి వెళితే, కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామంలోని ఓ కూలీ ఇంట్లో మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు డిటోనేటర్లు మొదట పేలాయి. ఈ పేలుడు ధాటికి మంటలు చెలరేగి, అక్కడే ఉన్న గ్యాస్ సిలిండర్లకు అంటుకున్నాయి. దీంతో భారీ శబ్దంతో పేలుడు సంభవించి, ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

ఈ దుర్ఘటనపై మంత్రి సత్యకుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అక్రమంగా డిటోనేటర్లు ఎందుకు నిల్వ ఉంచారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## నాపై నమ్మకంతో మరోసారి పదవి అప్పగించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు: పల్లా శ్రీనివాసరావు

ప్రకటన విడుదల చేశారు.

ఒక బీసీ బిడ్డగా తనకు ఈ స్థాయిలో గుర్తింపు లభించడం చంద్రబాబు దూరదృష్టికి, బీసీల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా, సీనియర్ల అనుభవాన్ని గౌరవిస్తూనే యువతను ప్రోత్సహిస్తామని తెలిపారు. భవిష్యత్ తరాలకు టీడీపీని ఒక తిరుగులేని రాజకీయ శక్తిగా తీర్చిదిద్దుతామని ఆయన భరోసా ఇచ్చారు.పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్ బాధ్యతలు చేపట్టడం టీడీపీ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని పల్లా అభివర్ణించారు. తన పనితీరుతో క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని, యువతరాన్ని ఏకతాటిపైకి తెచ్చిన లోకేశ్... రాబోయే రోజుల్లో పార్టీని మరిన్ని విజయాల వైపు నడిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆయన నియామకం పార్టీ నవశకానికి వారధిగా నిలుస్తుందన్నారు.

టీడీపీలో కార్యకర్తే అధినేత అని ఈ నియామకాలతో మరోసారి రుజువైందని పల్లా శ్రీనివాసరావు అన్నారు. సామాన్య మండల స్థాయి అధ్యక్షులకు సైతం అత్యున్నత కమిటీ అయిన పోలిట్ బ్యూరోలో స్థానం కల్పించడం అభినందనీయమన్నారు. జాతీయ, రాష్ట్ర కమిటీల్లో కొత్తగా నియమితులైన నాయకులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. వారి నియామకం వారి శ్రమకు, నిబద్ధతకు దక్కిన గుర్తింపు అని కొనియాడారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, పార్టీని అన్ని స్థాయిల్లో మరింత బలోపేతం చేయాలని ఆయన ఆకాంక్షించారు.

## పాకిస్థాన్‌కు అప్పులోళ్ల బాధ... వెంటబడుతున్న గల్ఫ్ దేశాలు!

ఇతర దేశాలు కూడా పాక్ ను అప్పులు చెల్లించాలని వెంటబడుతున్నాయి. ఈ పరిణామాలతో ఇస్లామాబాద్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. అనేక సంవత్సరాలుగా గల్ఫ్ దేశాలు, చైనా వంటివి పాకిస్థాన్‌కు అండగా నిలుస్తున్నా, ఇప్పుడు వాటి సహనం నశిస్తున్నట్లు ఈ పరిణామం సూచిస్తోంది.

దశాబ్దాలుగా పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ ఐఎంఎఫ్ బెయిలవుట్లు, గల్ఫ్ దేశాల డిపాజిట్లు, చైనా రుణాలపైనే ఆధారపడి నడుస్తోంది. ఒక్క చైనాకే పాక్ 25 బిలియన్ డాలర్లకు పైగా బకాయిపడి ఉంది. అయితే, ఈ స్నేహపూర్వక సాయం పాకిస్థాన్‌ను స్వయం సమృద్ధి దిశగా నడిపించలేకపోయిందని 'ఖల్సా వాక్స్' న్యూస్ పోర్టల్ తన కథనంలో విశ్లేషించింది. ప్రభుత్వ రంగంలో అవినీతి, బలహీనమైన పన్నుల వ్యవస్థ, ఇంధన రంగంలో పేరుకుపోయిన అప్పులు, రాజకీయ నాయకుల స్వప్రయోజనాలే దేశాన్ని ఈ దుస్థితికి తెచ్చాయని ఆ కథనం పేర్కొంది.మరోవైపు, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి మరిన్ని నిధులు పొందేందుకు పాక్ ప్రయత్నిస్తున్నా, ఆ సంస్థ విధించిన షరతులను నెరవేర్చడంలో విఫలమవుతోంది. డీజిల్‌పై సబ్సిడీని తొలగించాలని ఐఎంఎఫ్ స్పష్టం చేయగా, పాక్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పెట్రోల్‌పై పన్ను తగ్గించి నిబంధనలను ఉల్లంఘించింది.

ఇరాన్‌లో ఉద్రిక్తతల కారణంగా పెరిగిన చమురు ధరలతో పాక్ దిగుమతుల బిల్లు తలకు మించిన భారంగా మారింది. సరైన ఆర్థిక సంస్కరణలు చేపట్టకుండా, వృథా ఖర్చులను తగ్గించుకోకపోవడం వల్లే పాకిస్థాన్ ఈ సంక్షోభాన్ని స్వయంగా కొనితెచ్చుకుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## జర్నలిస్టుగా పనిచేసిన శ్రీహరి ఏమైనా ఉగ్రవాదా?: సజ్జల

గతంలో జర్నలిస్టుగా పనిచేసిన శ్రీహరి ఏమైనా ఉగ్రవాదా? అని ప్రశ్నించిన ఆయన, కనీసం ఎఫ్ఐఆర్ కాపీలు కూడా ఇవ్వకుండా పోలీసులు సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరిస్తున్నారని మండిపడ్డారు. ఈ అక్రమ అరెస్టుపై డీజీపీ తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

అక్రమ కేసులకు, అరెస్టులకు వైసీపీ భయపడదని సజ్జల స్పష్టం చేశారు. ఈ విషయంలో చట్టపరంగా పోరాటం చేస్తామని చెబుతూనే, నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులపై భవిష్యత్తులో కచ్చితంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. "అందరినీ గుర్తు పెట్టుకుంటాం.. ఎవరూ తప్పించుకోలేరు" అంటూ పోలీసులను ఉద్దేశించి ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ కక్షసాధింపు చర్యలను ప్రజలందరూ గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## సత్యసాయి జిల్లా పేలుడు ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

పేలిన ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం మనసుని కలచివేసిందని అన్నారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన జగన్... గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని, పేలుడు ధాటికి ఇళ్లు కూడా ధ్వంసమవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పేలుడు పదార్థాల నిల్వపై ప్రభుత్వం కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని, నిబంధనలు అతిక్రమించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలబడి, తగిన ఆర్థిక సహాయం అందించాలని సూచించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని పార్టీ శ్రేణులకు, అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్.. కమిటీలలో సామాన్యులకు పెద్దపీట

31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. పార్టీకి విధేయులుగా ఉంటూ, కష్టపడి పనిచేసిన వారికి ఈ నియామకాల్లో పెద్దపీట వేశామని స్పష్టం చేశారు. గతానికి భిన్నంగా, క్షేత్రస్థాయి కార్యకర్తలకు సైతం అత్యున్నత పదవులు కట్టబెడుతూ చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారని అన్నారు. గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్‌చార్జి గుత్తికొండ ధనుంజయ్‌కు నేరుగా పొలిట్‌బ్యూరోలో స్థానం కల్పించడమే ఇందుకు నిదర్శనమని వివరించారు. ఈ కమిటీల కూర్పులో సామాజిక న్యాయానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. 185 మంది సభ్యులున్న రాష్ట్ర కమిటీలో 122 మంది బడుగు, బలహీన వర్గాల వారేనని పల్లా తెలిపారు. ఇందులో బీసీలకు 77 (40%), ఎస్సీలకు 25 (25%), ఎస్టీలకు 7 (3.8%), మైనార్టీలకు 13 (7%) చొప్పున స్థానాలు కల్పించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలకు పెద్దపీట వేశారు. రాష్ట్ర కమిటీలో 50 మంది మహిళలకు అవకాశం ఇవ్వగా... పొలిట్‌బ్యూరో, జాతీయ కమిటీల్లోనూ వారికి సముచిత స్థానం కల్పించారు. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, నియోజకవర్గాల పునర్విభజన, 33 శాతం మహిళా రిజర్వేషన్లు వంటి భవిష్యత్ పరిణామాలను అంచనా వేస్తూ ఈ కమిటీలను రూపొందించారని పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ నియామకాల ద్వారా నామినేటెడ్ పదవులు ఆశించి భంగపడిన వారికి న్యాయం చేశామని, పార్టీ బలోపేతానికి ఈ మార్పులు దోహదపడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# పట్టు సాగు పై రైతుల ఆసక్తి చూపాలి

## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 15)

రైతులు సాధారణ పంటలతో పాటు ఆదాయాన్నిచ్చే పట్టు సాగు పై ఆసక్తిని పెంచుకొని ఆ దిశగా ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అన్నారు. బుధవారం మార్కాపురంలోని పట్టు పరిశ్రమ కార్యాలయంలో బై వోల్టిన్ పట్టు పరిశ్రమ సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పంట సాగుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక సబ్సిడీ ఇస్తున్నాయని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్సీ ఎస్టీలకు 90 శాతం, ఇతర రైతులకు 50 శాతం రాయితీ కల్పిస్తున్న విషయాన్ని వివరించారు. ప్రస్తుతం జిల్లాలో 480 మంది రైతులు 1200 ఎకరాల్లో ఈ పట్టు పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మల్బరీ సాగు గురించి రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. రైతులు సైతం ఇతర ప్రాంతాల్లో సాగు చేస్తున్న పద్ధతులు తెలుసుకొని ఆ దిశగా ఈ పంట సాగుకు సన్నద్ధం అవ్వాలన్నారు. సాధారణ పంటల కంటే ఈ పంటలో ఎక్కువ ఆదాయం వస్తుందని తెలిపారు. అధికారుల ద్వారా సందేహాలను నివృత్తి చేసుకొని ప్రభుత్వం అందించే సబ్సిడీలను సద్వినియోగం చేసుకొని రాణించాలన్నారు. ఎక్కువమంది రైతులను ఈ పంట సాగులోకి తీసుకువచ్చేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం సబ్సిడీపై వచ్చిన వివిధ రకాల యంత్ర పరికరాలను రైతులకు జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పట్టు పరిశ్రమలశాఖ అధికారి పి సుజయ్ కుమార్, అడిషనల్ డైరెక్టర్ అరుణకుమారి, సైంటిస్ట్ ఇబ్రహీం భాష, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.












ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

16.04.26 గురువారం


# రాష్ట్రంలో రాగవిద్వేషాలు రెచ్చగొట్టేందుకే జగన్ పర్యటనలు

**స్థానిక మత్స్యకారులు తిరస్కరిస్తున్నా ఎందుకు పర్యటిస్తున్నారో చెప్పాలి**

**మత్స్యకారులు కాని వారిని పర్యటనలకు తరలిస్తున్నారు**

**జగన్ తీరుపై మంత్రి స్వామి ఫైర్**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15):** రాష్ట్రంలో రాగవిద్వేషాలు రెచ్చగొట్టేందుకే జగన్ పర్యటనలు చేస్తున్నారని, ఆయన పర్యటనలతో రాష్ట్రంలో ఏం సాధిస్తున్నారని జగన్ తీరుపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఫైర్ అయ్యారు. ఒంగోలులో మంత్రి మీడియాతో మాట్లాడుతూ జగన్ అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకారులకు ఏమి చేయలేదని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం మత్స్యకారులను రెచ్చగొట్టి తన రాజకీయ పబ్బాన్ని గడుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకపక్క స్థానిక జువ్వలదిన్నె మత్స్యకారులు జగన్ తమ ప్రాంతానికి రావద్దు జగన్ పర్యటనను బాయ్ కాట్ చేసినప్పటికీ జగన్ మాత్రం పక్క జిల్లాలకు చెందిన, మత్స్యకారులకు చెందని వర్గాల ప్రజలను తరలించి తమ పర్యటనలను సాగిస్తున్నారని విమర్శించారు. కృష్ణపట్నం పోర్టు ప్రాంతంలో మరో పోర్టు రాకుండా జగన్ తండ్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జీవో తీసుకువచ్చారని ఆరోపించారు. ఆ జీవో స్థానంలో టిడిపి ప్రభుత్వం మార్పులు చేసి రామాయపట్నం పోర్టులు తీసుకు వచ్చిందని గుర్తు చేశారు. వేట నిషేధం సమయంలో జగన్ ప్రభుత్వం మత్స్యకారుల కుటుంబాలకు కేవలం రూ.4.50 వేలు అందిస్తే, టిడిపి ప్రభుత్వం మాత్రం రూ. 20 వేలు అందిస్తుందని గుర్తు చేశారు. అలాగే తెలుగుదేశం పార్టీ జాతీయ కమిటీలో సామాన్య కార్యకర్తలకు పెద్దపీట వేశారని అభినందనలు తెలిపారు. సామాన్య కార్యకర్తలను (తరువాయి 4లో...)


# 22ఏ భూ సమస్యల పరిష్కారం పై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలి

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 15)**

22ఏ భూ సమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్, రాష్ట్ర భూ పరిపాలనా శాఖ ముఖ్య కమిషనర్ జి జయలక్ష్మితో కలిసి రాష్ట్రంలో 22ఏ భూ సమస్యల పరిష్కారం, రీ సర్వే, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, జలధార – జలహారతి కార్యక్రమం అమలు తదితర అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో 22ఏ భూ సమస్యల పరిష్కారం పై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. నిర్దేశించిన గడువు లోపు రీ సర్వే ప్రక్రియ పూర్తి చేయాల్సిందిగా సూచిస్తూ అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. భూగర్భ జలమట్టాలను పెంచడమే లక్ష్యంగా జలధార – జలహారతి 100 రోజుల కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఒంగోలు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పాల్గొని జిల్లాలో 22ఏ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అలాగే జలధార – జలహారతి 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం కింద జిల్లాలో 600 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను, సుమారు 1100 ఫీడర్ కెనాల్స్ కు సంబంధించి పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులను గుర్తించడం జరిగిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ బాషా, కలెక్టరేట్ రెవెన్యూ సెక్షన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణ ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్ల ఏర్పాటు పేద ప్రజలకు వరం

**జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత**

**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఏప్రిల్ 15)**

గ్రామీణ ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయడం పేద ప్రజలకు వరమని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అన్నారు. బుధవారం ఎర్రగొండపాలెం లో నూతన అన్నా క్యాంటీన్ ను ఎర్రగొండపాలెం తెదేపా ఇన్చార్జి ఎరిక్షన్ బాబు, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డిలతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 62 అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. క్యాంటీన్ల నిర్వాహకులు శుభ్రత, నాణ్యతను పాటించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం రూ.8.89 కోట్ల మంది అన్నా క్యాంటీన్లలో భోజనం చేసినట్లు వివరించారు. అన్నా క్యాంటీన్లో భోజనం చేసే ప్రజలు వారి అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. అదేవిధంగా ఈ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎర్రగొండపాలెం తెదేపా ఇన్చార్జి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ చెప్పిన మాట ప్రకారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా కల ను నెరవేర్చాడన్నారు. త్వరలోనే వెలిగొండ ప్రాజెక్టును సైతం పూర్తి చేసి ఉమ్మడి ప్రకాశం జిల్లా వాసుల కలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఆర్డీవో ప్రభాకర్, ఎర్రగొండపాలెం తాసిల్దార్ మంజునాథరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, ఇతర తెదేపా నాయకులు పాల్గొన్నారు.





4

# ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన అంబేద్కర్ గురుకులం విద్యార్థులు

**సీనియర్ ఇంటర్‌లో 92 శాతం**

**జూనియర్ ఇంటర్‌లో 87 శాతం ఉత్తీర్ణత**

**సీనియర్ ఇంటర్‌లో 900 కు పైగా మార్కులు సాధించిన 3 వేల మంది విద్యార్థులు**

**విద్యార్థులకు మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అభినందనలు**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15)**

బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో డా.బి. ఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థులు సత్తా చాటారు. సీనియర్ ఇంటర్ లో 92 శాతం, జూనియర్ ఇంటర్లో 87 శాతం ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్ లో 3 వేల మంది విద్యార్థులు 900 కు పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి విద్యార్థులను అభినందించారు. బుధవారం విడుదల ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అంబేద్కర్ గురుకులం విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. విద్యార్థులు, సిబ్బందికి అభినందనలు. అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో పేద విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. పేద పిల్లలు ఇంజనీర్లు, డాక్టర్లు కావాలన్న సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పంతో నీట్, ఐఐటీ ఎక్సలెన్సీ సెంటర్లు 3 నుంచి 10కి పెంచామన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. పేద పిల్లలకు నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఎంత ఖర్చు అయినా మా ప్రభుత్వం భరిస్తుంది. పేద పిల్లలు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని మంత్రి స్వామి అన్నారు.

# పేదల ఆకలి తీర్చడం కోసమే చంద్రన్న అన్నా క్యాంటీల ఏర్పాటు

**రాష్ట్ర సాంఘీక, సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి**



**(షణ్ముఖ వెలుగు, కొండపి, ఏప్రిల్ 15)**

పేదల ఆకలి తీర్చడం కోసం చంద్రన్న అన్నా క్యాంటీన్ లను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. బుధవారం సింగరాయకొండ లో అన్నా క్యాంటీన్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదవాడికి పట్టెడన్నం పెట్టడం కంటే మించిన ఆనందం ఏముందన్న.. అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో సీఎం చంద్రబాబు అన్న క్యాంటీన్లు ప్రారంభించారన్నారు.ఇచ్చిన మాట ప్రకారం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి రూ.5 కే పేదల ఆకలి తీర్చుతున్నామని మంత్రి చెప్పారు.రాష్ట్రంలో మొదటి విడతగా పట్టణ ప్రాంతాల్లో 207, నేడు రెండో విడతగా గ్రామీణ ప్రాంతాల్లో 62 అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నామన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా ప్రతి రోజు 2.20 లక్షల మంది పేదల ఆకలి తీర్చుతున్నామని ఇదొక చరిత్ర అని ,ఇటువంటి గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి మంత్రి ధన్యవాదాలు చెప్పారు. ఈ ప్రాంతానికి అన్నా క్యాంటీన్ ఏడు సంవత్సరాలు కల అని ఆయన అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఈరోజు యర్రగొండపాలెం, దర్శి, సింగరాయకొండ లో మధ్యాహ్న భోజనం తో ప్రారంభించుకున్నాం . ఈ క్యాంటీన్ ద్వారా (తరువాయి 4లో...)

## రత్నం విద్యాసంస్థల వారి శ్రీ వీరిశెట్టి జూనియర్ కాలేజ్ విద్యార్థుల ప్రభంజనం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 15)

ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్టేట్, టౌన్ ఫస్ట్ ర్యాంకులతో రత్నం విద్యా సంస్థల వారి శ్రీ వీరిశెట్టి జూనియర్ కళాశాల విద్యార్థులు సంచలనం సృష్టించారు. ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో భోగాల శ్రీనివాసరెడ్డి (ఎంపిసి) 465/470 స్టేట్ 3వ ర్యాంక్, సనిశెట్టి వెంకటలక్ష్మి కుందువ (బైపీసీ) 465/470 స్టేట్ 3వ ర్యాంక్, షేక్ ఆబిద (ఎంపిసి) 460/470 టౌన్ ఫస్ట్, షేక్ సీమ హర్షిన్ (బైపీసీ) 449/455 టౌన్ ఫస్ట్, ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో కోడూరి లక్ష్మి శైలజ (ఎంపిసి) 988/1000 టౌన్ ఫస్ట్, నలమూరి మణి శ్రీ (బైపీసీ) 988/1000 టౌన్ ఫస్ట్ సాధించారని యాజమాన్యం తెలిపింది. విజేతలకు యాజమాన్యం, అధ్యాపకులు స్వీట్లు పంపిణీ చేశారు. కష్టపడి చదివి అద్భుతమైన మార్కులు సాధించిన విద్యార్థులకు, వారికి వెన్నుముకగా నిలిచిన తల్లి దండ్రులకు, అధ్యాపక బృందానికి హృదయపూర్వక అభినం దనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ వీరిశెట్టి విద్యాసంస్థల కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కాలేజీ డైరెక్టర్ కృష్ణంరాజు, ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి రవి, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది అందరూ విద్యార్థులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

## ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రదర్శన చూపిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు

### మొదటి సంవత్సరం ఇంటర్ ఫలితాలలో 38 మందికి గాను 30 మంది ఉత్తీర్ణత

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 15)

మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాలలో కేజీబీవి విద్యార్థిని వి స్పందన 449/470 మార్కులు సాధించారు. అదే విధంగా ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం ఫలితాలలో 77% ఉత్తీర్ణత సాధించడంతో పాటు 27మంది విద్యార్థనులకు గాను 21 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరం ఫలితాలలో 888/1000 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ చూపింది తేజస్విని. ఇంటర్మీడియట్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులను ప్రిన్సిపల్ కె సింధు ప్రత్యేకంగా అభినందించారు.

## శ్రీ సాయి ఒలంపియాడ్ స్కూల్లో 2026 గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 15)

మండల కేంద్రమైన ఉలవపాడు శ్రీ సాయి ఒలంపియాడ్ స్కూల్ నందు బుధవారం గ్రాడ్యుయేషన్ డే 2026 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా రిటైర్డ్ టీచర్ కమలాదేవి, రిటైర్డ్ డిప్యూటీ డిఈఓ ప్రసాద్ రావు, కేశవరపు జాలి రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు గారాబం తో పాటు క్రమశిక్షణ స్వేచ్ఛ మరియు సమయాన్ని వారి కోసం తల్లిదండ్రులు ఎలా కేటాయించాలి. అనే విషయాల గురించి మాట్లాడారు విద్యార్థి దశ ఒక దీక్ష లాంటిదని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ఎలా ప్రవర్తించాలి. వారి పై తల్లిదండ్రుల ప్రభావం ఎలా ఉంటుందని చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ కేశవరపు వెంకట శేషమ్మ, ప్రిన్సిపాల్ మౌనిక, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చడం కోసమే చంద్రన్న అన్నా క్యాంటీల ఏర్పాటు





ఉదయం 5 రూపాయలకే టిఫిన్, మధ్యాహ్నం 5 రూపాయలకే భోజనం , పట్టణ ప్రాంతాల్లో రాత్రి కూడా పెడుతున్నారని , గ్రామీణ ప్రాంతాల్లో కూడా అవసరం ఉంటే పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. సింగరాయకొండ లో 3 కోట్లతో రోడ్డు వెడల్పు చేస్తున్నామన్నారు. సింగరాయకొండ సెంటర్లో ఎలక్ట్రికల్ స్తంభాలు పెట్టీ రెండు వైపుల లైట్లు వేస్తామన్నారు. వ్యవసాయ సహకార సంఘం కనుమల్ల వారి ఆధ్వర్యంలో సూపర్ బజార్ ను కట్టబోతున్నాం అని మంత్రి తెలిపారు. అవసరాన్ని బట్టి ఇంకో రెండు కూడా తెస్తామన్నారు.తక్కువ ఖర్చుతో నాణ్యమైన సరుకులు ఇస్తామన్నారు. ప్రభుత్వం మహిళా సాధికారత , ప్రజా సంక్షేమం కోసం కట్టుబడి ఉందన్నారు. ఇనామ్ భూములకోసం ప్రభుత్వం కమిటీ వేసిందని త్వరలో దానిని కూడా పరిష్కరిస్తామన్నారు. ఎండల తీవ్రతను దృషిలో పెట్టుకుని పిల్లలు,వృద్ధులు అనవసరంగా బయట తిరగ వద్దని చెప్పారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అనంతరం ప్రజలతో కలిసి అన్న క్యాంటీన్లో మంత్రి భోజనం చేశారు.

## ఇంటర్ ఫలితాలలో శ్రీహర్షిణి విద్యార్థుల సత్తా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15)



ఇంటర్మీడియట్ ప్రథమ మరియు ద్వితీయ సంవత్సర ఫలితాలలో శ్రీహర్షిణి కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు మరోసారి తమ విజయపరంపరను కొనసాగించారు దాది ఆంజనేయులు మీడియా సమావేశంలో తెలిపారు. జూనియర్ ఇంటర్ యం.పి.సి విభాగం నందు అలవల వసంతలక్ష్మి 470 మార్కులకు గాను 467 మార్కులతో ప్రకాశం జిల్లాలో ప్రథమస్థానం కైవసం చేసుకున్నారు. ఐనవోలు అనూష, కల్లె వైష్ణవి, చాగంటి రమ్య, జడ దివ్య అరుణలు 466 మార్కులతో ద్వితీయ స్థానాన్ని పొందారు. జూనియర్ బై.పి.సి విభాగం నందు రాయి వసుధ 455 మార్కులకు గాను 447 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచారు. బండి హరిణి 444 మార్కులు, అన్నంగి పైసి, రేవు వాసవ్య పల్లవి, షేక్ షబూర్ లు 443 మార్కులు సాధించి ద్వితీయ మరియు తృతీయ స్థానంలో నిలిచారు. జూనియర్ సి.ఇ.సి విభాగం నందు షేక్ మదిని 500 మార్కులకు గాను 491 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. గుండాబత్తిని చరణ్ 482 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు.సీనియర్ యం.పి.సి విభాగం నందు బత్తుల ధరణి 1000 మార్కులకు గాను 991 మార్కులతో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. యం. వెంకట జ్యోత్స్న, డి. అర్చిత, జి. లక్ష్మీ శైలజ, పి. హృదయబాబులు 989 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, పి. తన్విత, కె. వెంకట కిషోర్లు 988 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.సీనియర్ బై.పి.సి విభాగం నందు జి. ఉజ్వల హర్షిణి 1000 మార్కులకు గాను 980 మార్కులతో ప్రకాశంజిల్లాలో ప్రథమ స్థానాన్ని, కె. నారాయణ స్వామి 978 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. జూనియర్ ఇంటర్ నందు 460 మార్కులకు పైగా 48 మంది, 450 మార్కులకు పైగా 128 మంది, 400 మార్కులకు పైగా 429 మంది. సీనియర్ ఇంటర్ నందు 980 మార్కులకు పైగా 50 మంది, 950 మార్కులకు పైగా 150 మంది, 900 మార్కులకు పైగా 288 మంది ఉత్తీర్ణత సాధించారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్, కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డైరెక్టర్ గోరంట్ల హర్షిత్, డీన్ దాది ఆంజనేయులు, అకడమిక్ డీన్ కరణం నారాయణ, ప్రిన్సిపల్స్ దివి రమేష్, యం ఏడుకొండలు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొని ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థినీ, విద్యార్థులందరికీ మిఠాయిలు తినిపించి అభినందనలు తెలియచేశారు.

## చలివేంద్రంను ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15)

రాంనగర్ ఒకటో వ లైన్ స్వర్గీయ వంగవీటి రంగా విగ్రహం వద్ద ప్రకాశం జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ మరియు కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసారు. ఈ చలివేంద్రంను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం స్వర్గీయ వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. వారిని ప్రకాశం జిల్లా కాపు సంఘం ఆధ్వర్యంలో దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం వారి చేతులు మీదగా మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఎండాకాలంలో ప్రజలకు మజ్జిగ, మంచినీరు అందజేయడం సంతోషకరమని అన్నారు. ప్రకాశం జిల్లా కాపుసంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్, కాపు నాయకులు డాక్టర్ నారపుశెట్టి శ్రీనివాసరావు, అడ్వకేట్ అయినా బత్తిన గోపికృష్ణ, తంజావూరి శ్రీనివాసమూర్తి, ఇందుర్తి మారుతి రావు,నాగిశెట్టి బ్రహ్మయ్య మాట్లాడుతూ కాపు సంఘం ఆధ్వర్యంలో ఈ వేసవి కాలంలో ప్రజల దాహం తీర్చడానికి చలివేంద్రం పెట్టటం మంచి పరిణామమని, మరి ఎన్నో సేవా కార్యక్రమాలు చేయాలని, రంగా ఆశయాలని కొనసాగించాలని, చిరంజీవి చేసే సేవాకార్యక్రమాలు చూసి అందరూ వారి అడుగు జాడల్లో నడవాలని, పవన్ కళ్యాణ్



స్ఫూర్తితో కాపు కుటుంబ సభ్యులందరు తొందర పడకుండా కలిసి మెలిసి ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు మంత్రి శ్రీనివాసరావు, బండారు మదన్, 15వ డివిజన్ అధ్యక్షులు గడ్డం ఆదినారాయణ, నారపుశెట్టి రామ్మోహన్‌రావు, వల్లంశెట్టి హనుమంతరావు, చెన్నంశెట్టి శివ, లింగిశెట్టి సుబ్బారావు, చింతలపల్లి నారాయణ, రావెళ్ళ రాఘవ, శెట్టి పాపారావు, కొల్లా హనుమంతరావు, తిర్లక వాసు, మొగిలిపువ్వు సత్యనారాయణ, తోట సాయి ప్రవీణ్, నక్కా ప్రమీల, మంగిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.





## గ్రామీణ ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్ల ఏర్పాటు పేద ప్రజలకు వరం



## రాష్ట్రంలో రాగవిద్వేషాలు రెచ్చగొట్టేందుకే జగన్ పర్యటనలు

పోలిట్ బ్యూరో లోకి తీసుకోవటం మంచి పరిణామం అన్నారు. అలాగే లోకేష్ ను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం మంచి పరిణామం అన్నారు. సామాన్య పార్టీ కార్యకర్తలకు పార్టీ ప్రమాద బీమా ఏర్పాటు చేయటం, కార్యకర్తల పట్ల పార్టీకి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. ఇంటర్లో 81 శాతం మంది రాష్ట్ర విద్యార్థులు పాస్ అవటం అభినందనీయమన్నారు. మిగిలిన వారు కూడా సప్లిమెంటరీ పరీక్షలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్ నియామకం పై మంత్రి గొట్టిపాటి హర్షం



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 15)

తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ నియామకం పై ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంత్రి నారా లోకేశ్ కు అభినందనలు తెలియజేశారు. జాతీయ కార్యనిర్వహక అధ్యక్షుడు గా నారా లోకేశ్ నియామకం ఆయన సమర్థవంతమైన నాయకత్వానికి దక్కిన గుర్తింపని పేర్కొన్నారు. లోకేష్ నాయకత్వంలో పని చేసేందుకు యువత మరింత ఉత్సాహం చూపిస్తున్నారని అన్నారు. ఆయన పై విమర్శలు చేసిన వారికి 'యువగళం పాదయాత్ర' ద్వారా లోకేశ్ సమాధానం ఇచ్చారని తెలిపారు. ఇప్పటికే విద్య, ఐటీ శాఖ మంత్రిగా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో లోకేష్ కీలక పాత్ర పోషించారని చెప్పారు. అలాగే, అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు పోటీగా ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తీసుకురావడంలో ఆయన పాత్ర ముఖ్యమని అభిప్రాయపడ్డారు. ప్రకటించిన కొత్త కమిటీలతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వెలుగు కార్యాలయంలో వివోఏలకు శిక్షణ





(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఏప్రిల్ 15)

మండల కార్యాలయం పరిధిలోని వెలుగు కార్యాలయంలో బుధవారం బుణ జీవనోపాధుల సర్వేపై వివోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎండీఓ రాజలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు ఎలాంటి అవకతవకలు లేకుండా రుణాలు అందించేందుకు ప్రత్యేక యాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. మహిళల రుణ అవసరాలను సరిగ్గా గుర్తించి, అర్హులకు రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వివోఏలకు సూచించారు. అదే విధంగా మే 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జనగణ కార్యక్రమంపై గ్రూపు సభ్యులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించే బాధ్యత వివోఏలపై ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది, వివోఏలు పాల్గొన్నారు.

## కాలినడకన తిరుగుతూ... పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తూ...!

కందుకూరులో మొదటి 4 వార్డుల్లో ఎమ్మెల్యే ఇంటూరి విస్తృత పర్యటన
పారిశుద్ధ్యంపై స్థానికుల ద్వారా అభిప్రాయ సేకరణ
సిబ్బంది పనితీరు సరిగా లేదని పలుమార్లు ఆగ్రహం
పెండింగ్ రోడ్లు, కాలువల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశం
ఎమ్మెల్యే పర్యటన పట్ల ప్రజల్లో విశేష స్పందన






(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 15)
బుధవారం పొద్దుపొద్దున్నే ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు మున్సిపాలిటీలో వార్డుల పర్యటనకు శ్రీకారం చుట్టారు. అధికారులు, నాయకులతో కలిసి కాలినడకన వార్డుల్లో కలియదిరుగుతూ ప్రజలతో మమేకమయ్యారు. ప్రతి ఇంటికి వెళ్లి పలకరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. 1 నుంచి 4 వార్డుల పరిధిలోని ఉప్పుచెరువు, జనార్ధన కాలనీ, టిఆర్ఆర్ కాలేజీ పడమర వైపు, బలరామయ్య తోట, ఆర్టీసి డిపో ఉత్తరం వైపు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. కొన్నిచోట్ల రోజుల తరబడి సైడ్ కాలువలు శుభ్రం చేయడం లేదని, ఫలితంగా దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కాలువలలో నిలిచిన మురుగునీరు, పేరుకుపోయిన చెత్తను ఎమ్మెల్యేకి స్వయంగా చూపించారు. ప్రతిబజారులో మురుగునీటి పారుదల, శానిటేషన్ ను ప్రత్యేకంగా పరిశీలించిన ఎమ్మెల్యే మున్సిపాలిటీ సిబ్బంది పై పలుసార్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి లోఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, ఎన్నిసార్లు హెచ్చరించినా తీరు మారడం లేదన్నారు. ఇకనుంచి తరచుగా వార్డుల్లో ఆకస్మికంగా పర్యటిస్తానని చెప్పారు. 3వ వార్డు కాలనీ భూములు 15 సంవత్సరాలుగా నిషేధిత 22ఏ జాబితాలో ఉంటే, తాను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించిన విషయాన్ని స్థానికులకు ఎమ్మెల్యే గుర్తుచేశారు. సమస్య తీరిపోయినందున, కాలనీలో అన్ని రోడ్లు అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెప్పారు. ఆర్టీసీ డిపోలో చెత్త పేరుకుపోయి ఉండడాన్ని ఎమ్మెల్యే గమనించి, డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని డిపోమేనేజర్ కు సూచించారు. అలాగే, డిపో ఉత్తరంవైపు రోడ్డులో సైడ్ కాలవపై ఆక్రమణలను వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ అనూషను ఆదేశించారు. కొత్తగా భవనాలు నిర్మించుకునే వారికి నోటీసులు ఇచ్చి, వ్యర్థాలను సైడ్ కాలువల్లో వెయ్యకుండా చూడాలన్నారు. 4 వార్డుల్లో ఇంకా నిర్మించాల్సిన సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆర్థిక వనరులను బట్టి, ప్రాధాన్యత క్రమంలో ఒక్కొక్కటిగా పూర్తి చేయాలన్నారు. డ్రైనేజీ నిర్మాణాల్లో లెవెల్స్ సక్రమంగా పాటించకపోతే, సదరు కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు నిలిపివేయాలని కూడా ఎమ్మెల్యే ఆదేశించారు. స్థానిక నాయకులు ప్రతిరోజు వార్డుల్లో పర్యటిస్తూ, శానిటేషన్ పై దృష్టిపెట్టాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా మునిసిపల్ సిబ్బందికి నిర్దేశం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ అనూష, డిఈ గణపతి,కిపట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నియోజకవర్గ బిజెపి కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు, నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, ఏపీఈడబ్ల్యుఐడీ కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, రాష్ట్ర వాణిజ్యభాగం కార్యనిర్వాహక కార్యదర్శి కూనం నరేంద్ర, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, వార్డు అధ్యక్షులు చల్లా మహేంద్ర, పువ్వాడి కోటయ్య, పొడపాటి మాధవ, పార్టీ నాయకులు ముచ్చు వేణు, గడ్డం మాలకొండయ్య, పులి నాగరాజు, చుండూరి శ్రీను, యర్రా మున్సలయ్య, పువ్వాడి మురళి, మచ్చా మనోహర్, నల్లూరి సూర్యనారాయణ, ముప్పవరపు వేణు, భవనాసి వెంకటేశ్వర్లు, పీలా శ్రీను, మంచిరాజు మురళీమోహన్, సవిడిబోయిన వెంకటకృష్ణ, గుర్రం మధు, షేక్ కాలేషా, సుబ్బరాజు, వడ్డేళ్ళ రవిచంద్ర, నందనవనం రామసుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీకి కొత్త దిశ, కొత్త శక్తి

తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్‌కు శుభాకాంక్షలు
ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఏప్రిల్ 15)
తెలుగుదేశం పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులైన మంత్రి నారా లోకేష్ సారథ్యంలో కొత్త దిశ, కొత్త శక్తి సంతరించుకుంటుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. దూరదృష్టి గల నాయకుడు నారా చంద్రబాబునాయుడు నాయకత్వ వారసత్వాన్ని అందిపుచ్చుకుని, యువత ఆలోచనలకు దగ్గరగా ఉండే శక్తివంతమైన నాయకుడిగా లోకేష్ ఎదుగుతున్నారు. పార్టీ పట్ల అంకితభావం, ప్రజల పట్ల బాధ్యత. ఇవి ఆయన నాయకత్వానికి అసలైన బలం. విద్యాశాఖలో ఆధునిక మార్పులు, డిజిటల్ విద్య ప్రోత్సాహం, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత పెంపు, ఇవి భవిష్యత్ తరాలకు బలమైన పునాది. ఐటీ రంగంలో పెట్టుబడులు, యువతకు ఉపాధి అవకాశాలు, ఇవి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాయి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేస్తూ, కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలుస్తున్న ఆయన నాయకత్వం తెలుగుదేశం పార్టీకి మరింత శక్తిని, విజయాన్ని అందించాలి.

## కరేడు అది ఆంధ్ర పాలెంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 15)
ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలో గల కరేడు సెక్టార్ అది ఆంధ్ర పాలెం ఎస్సీ కాలనీ నందు బుధవారం సిడిపిఓ డి మాధవిలత ఆదేశాల మేరకు సూపర్వైజర్ ఎం నాగలక్ష్మి ఆధ్వర్యంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ పోషణ పక్వాడ ముఖ్య ఉద్దేశం మొదటి ఆరు సంవత్సరాల లో బిడ్డ మెదడు అభివృద్ధిని మెరుగుపరచడం అనే ఉద్దేశం పైన గర్భవతులకు బాలింతలకు తల్లులకు పురుషులకు తెలియజేయటం. మొదటి 1000 రోజులు ప్రాముఖ్యత జంక్ ఫుడ్ వలన కలిగే నష్టాలను తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మాలతి, ఆశ వర్కర్ ఏ. నిర్మల, ఎం ఎల్ హెచ్ పి ఖుషి యా భేగం, అంగన్వాడీ వర్కర్స్ సుజాత, శేషమ్మ పాల్గొన్నారు.

## జనగణన లెక్కింపుకు శిక్షణ శిభిరం మే 1 నుంచి ప్రారంభం కానున్న జనగణన

ఖచ్చితమైన సమాచారం కొసం ప్రత్యేక శిక్షణ
సేకరించే సమాచారం మొత్తం డిజిటల్‌లోనే



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 15)
మే 1 నుంచి ప్రారంభం కానున్న జనగణణ కార్యక్రమానికి నగర పంచాయితీ పరిధిలోని సచివాలయ, రెవెన్యూ సిబ్బందికి పొదిలిలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సారి జనభా లెక్కింపుకు సాంకేతిక పరికరాలు ఉపయోగించి అత్యంత ఖచ్చితమైన సమాచారం సేకరించేందుకు అధికారులు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. రెండువితలుగా శిక్షణ కార్యక్రమం జరగనుందని తొలివిడతగా 15,16,17 తేదిలు మలివిడతగా ఈ నెల 21 నుండి ఇవ్వనున్నట్లు నగర కమీషనర్ ఎ మారుతిరావు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రజల వద్దనుంచి ఏవిధంగా సమాచారం సేకరించాలి వారికలిగే సంశయాలు ఏవిధంగా తీర్చాలి, డిజిలైటైజేషన్ ఏవిధంగా చేయాలి అనే అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయితీ పరిధిలోని సచివాలయ సిబ్బంది, విఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సాంస్కృతిక శిక్షణా శిబిరాలను రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15)
కళ కళ కోసం కాదు, కళ ప్రజల కోసం అని చాటిచెబుతూ, ప్రజా సాంస్కృతికోద్యమంలో అరుణోదయ ఆట, మాట, పాటై.. భూస్వామ్య, సామ్రాజ్యవాద విష సంస్కృతికి వ్యతిరేకంగా గళం విప్పుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన గళం విప్పుతున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు, జనరల్ కౌన్సిల్ ఈనెల 16 నుంచి 18 వరకు ఒంగోలులోని మాదాల నారాయణస్వామి భవనంలో 19 తేదీ ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరుగుతాయి. వీటిని జయప్రదం చేయాలని అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు చొప్పర జాలన్న పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన గోడ పత్రికలను ఈరోజు ఒంగోలులోని జివచీ రీడింగ్ రూమ్‌డ క్లబ్ లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ జాలన్న మాట్లాడుతూ ఏప్రిల్ 16 నుంచి 18 వరకు ఒంగోలులోని మాదాల నారాయణ స్వామి భవనంలో డప్పు కళాకారులకు శిక్షణ, పాటలు నేర్పించడం, అభ్యుదయ గీతాలకు నృత్యాలు నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ నాటక రచయిత, కళాకారుడు డాక్టర్ పాటిబండ్ల ఆనంద్ రావు ప్రారంభిస్తారన్నారు. అలాగే చివరి రోజైనా 19వ తారీకు ఒంగోలు నగరంలోని కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఎన్టీఆర్ కళాక్షేత్రంలో అరుణోదయ రాష్ట్రస్థాయి జనరల్ కౌన్సిల్ ఉంటుంది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసిం హాజరవుతున్నారు. పై కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న కళాకారులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఒంగోలు నగరం కూడా అనేక కళారంగా సంస్థలకు వేదికగా ఉంది. గొప్ప గొప్ప కళాకారులను కల రంగానికి అందించిన చరిత్ర ప్రకాశం జిల్లా కు ఉంది. కనుక ఈ జిల్లాలో ఉన్న కళాకారులు, కళా రంగ సంస్థలు కూడా ఈ అరుణోదయ శిక్షణ తరగతులకు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు అంగలకుర్తి ప్రసాద్, మిడసల మల్లికార్జున, దారా సుబ్బారావు, అరుణోదయ అంజయ్య, రామారావు, వెంకటసుబ్బయ్య, రచన, హానిత తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్2 విజేతకు అభినందన




(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 15)
కందుకూరు పట్టణంలోని ఆది ఆంధ్ర కాలనీకి చెందిన పర్సు సురేష్ ఇటీవల జరిగిన గ్రూప్2 పరీక్షల్లో ఉత్తమ ఫలితం సాధించి సబ్ రిజిస్టర్‌గా ఎంపికయ్యారు. గతంలో రెవిన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ కష్టపడి ఉద్యోగం సాధించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని సురేష్ మర్యాదపూర్వకంగా కలవగా, అతనిని ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నాయకులు పర్సు నాగేశ్వరరావు, చదలవాడ కోటేశ్వరరావు, ఐజాక్, రామయ్య, తదితరులు సురేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఇంటర్ పరీక్షల ఫలితాలలో విజయ ఢంకా మోగించిన ఒంగోలు నారాయణ కాలేజీ విద్యార్థులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15)
ఇంటర్ పరీక్షల ఫలితాలలో ఒంగోలు నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి సత్తా చాటారని ప్రకాశం జిల్లా నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ మధుసూదనరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు సరస్వతి భవన్ మరియు కోర్ట్ సెంటర్ క్యాంపస్ లలో సీనియర్ ఇంటర్ ఎం.పి.సి లో 1000 మార్కులకి గాను బి సాహితి 992, ఎన్. యశస్వి 991, డి. ఉదిత్ 990 , బి. నీలిమేఘ 989 మార్కులు సాధించి మొదటి మూడు స్థానాలలో నిలిచారు. సీనియర్ ఇంటర్ బైపిసి లో 1000 మార్కులకి గాను రియాజ్ 979 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. రెండూ గ్రూప్స్ లో 950 కి పైగా 85 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి లో 470 మార్కులకి గాను జి పవన్ సాత్విక 466, కె. తన్మయి 465, ఎన్. ప్రణీత్ 464, సాయి సుహిత 464, కె.సాయి అక్షయ 464, సమీర 464, మొబీనా సుల్తానా 464, పి.నాగ చై తన్య 463, పి. నీహారిక 463, సల్మా బేగం 463 మార్కులు సాధించి మొదటి మూడు స్థానాలలో నిలిచారు. 450కి పైగా మార్కులు 70 మంది విద్యార్థులు సాధించారు. బైపిసి లో 455 మార్కులకి గాను ప్రమోద్ హర్షిత 450, రోషన్ 442,యశస్వి 439 మార్కులు సాధించి మొదటి మూడు స్థానాలలో నిలిచారని పేర్కొన్నారు. మొత్తంగా 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డీన్ మధుసూధన్‌రెడ్డి పేర్కొన్నారు. విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. నారాయణ సంస్థల ఏజిఎం మురళి మాట్లాడుతూ ఏ పరీక్షల ఫలితాలలో నైనా నారాయణ విద్యార్థులదే పైచేయి అని అన్నారు. ఈ విజయానికి కారణమైన ప్రిన్సిపాల్ ఎన్ సుజాత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.



# ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు అంగన్వాడీలు సమరశీల పోరాటం సాగించాలి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15)

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు అంగన్వాడీలు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. బుధవారం నాడు స్థానిక ఎన్ జిఓ హోమ్ లో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ 12 వ మహాసభల సందర్భంగ జరిగిన సభలో ఆమె ముఖ్యవక్తగా మాట్లాడారు. అంగన్వాడీ సంఘ నాయకులు వై సత్యవతి, ఇందిరాదేవి అధ్యక్షవర్గంగా జరిగిన ఈ కార్యక్రమం లో సుబ్బరావమ్మ మాట్లాడుతూ తనకు తాను విశ్వగురుగా ప్రకటించుకున్న మోడీ దేశం వికసిత్ భారత్‌గా వెలిగిపోతుందని, ఆయన అడుగుల్లో నడిచే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రం స్వర్ణాంధ్ర గా వికసిస్తుందని చెప్పుకునే నేతలు దేశంలో పోషకాహారం అందని 80%, ప్రజల గురించి, 50%పోషకాలు అందని బాలల గురించి, రక్తహీనతకు గురవుతున్న 70%మహిళల గురించి, ఏటా మరణిస్తున్న లక్షల మంది బాలల గురించి, ప్రతి రోజూ పౌష్టికాహార లోపంతో మరణిస్తున్న వేల పసికందుల గురించి జవాబు చెప్పాలని నిలదీశారు. కేవలం గౌరవ వేతనం పొందుతూ దేశ వ్యాప్తంగా పేదలకు పోషకాహారం అందిస్తూ సామాజిక భాధ్యతగా సేవ చేస్తున్న అంగన్వాడీలకు కనీస వేతనం తో పాటు తగిన గౌరవం దక్కాలంటే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వేతనాలు అమలులో ఒక్కో రాష్ట్రం ఒక తీరుగా చెల్లిస్తున్నారని, గుజరాత్‌లో కార్యకర్తలు 24800, హెల్పర్లకు రూ.20 వేలు కోర్టు ద్వారా సాధించిన వైనాన్ని గుర్తు చేశారు. అంగన్వాడీలను మూడో తరగతి ఉద్యోగులుగా, వర్కర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం సాధించేందుకు ఐక్య పోరాటం చేయాలన్నారు. ఇదిలావుండగా ప్రతి వ్యక్తికి పోషకాహారం, విద్య, వైద్యం వంటి ప్రాధమిక అవసరాలు కల్పించవలసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్ లో మిడ్ డే మీల్‌లో, రేషన్‌లో కోత

## క్య ఉద్యమాల ద్వారానే హక్కుల సాధన ఉద్యోగ, కార్మిక, కర్షక ఐక్య సంఘటన సాధించాలి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా మహా సభలో పిలుపు




కేంద్ర మంత్రి వరకు ఏకరువు పెట్టినా దున్నపోతు పై వర్షం పడ్డ చందంగా వ్యవహరిస్తున్నట్లు దుయ్యబట్టారు. ఎన్నికల్లో అంగన్వాడీల శిబిరాల్లోకి వచ్చి కల్లబొల్లి మాటలతో నమ్మించి తీరా అధికారం చేపట్టిన తరువాత అంగన్వాడీల పట్ల అలుసుగా వ్యవహరిస్తున్నారని దునుమాడారు. కార్మిక వర్గం తలచుకుంటే ఏమయినా సాధించవచ్చని విశాఖ ఉక్కు కార్మికుల ఆందోళన, అంగన్వాడీలసమ్మె రుజువు చేసిందన్నారు. విశాఖ ఉక్కు కార్మికుల

విధిస్తున్నట్లు దుయ్య బట్టారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం గత ఏడాది పలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన అంశాన్ని గుర్తు చేశారు. ఎస్మా వంటి నిర్భంధాలు ఎదిరించి ఎన్నో విజయాలు సాధించిన ఉద్యమ స్ఫూర్తితో అంగన్వాడీలు స్కీమ్ వర్కర్స్, ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటం సాగించాలని పిలుపు నిచ్చారు. కాకినాడలో 100 అంగన్వాడీ కేంద్రాలు ఆదానికి కట్టబెట్టి, సెంటర్లలో అంగన్వాడీల పర్యవేక్షణకు ఒక వ్యకక్తిని కేటాయించిన అంశం పై కలెక్టరేట్‌ను ముట్టడించగా ఆ ప్రయత్నం విరమించుకున్న అంశాన్ని ఈ సందర్భంగా ప్రస్థావించారు. అంగన్వాడీల సమస్యల పై రాష్ట్ర స్థాయిలో స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి, లోకేష్ మొదలు చంద్రబాబు నాయుడు,

ఐక్యత వల్లనే 1% కూడా ప్రైవేటీకరణ చేయలేకపోయారని గుర్తు చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న సంస్కరణలనుఎదిరించేందుకు పోరాటాలు ఉధృతం చేయాలని కోరారు. అంగన్వాడీలను వేదిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్, సంఘ ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, ఉపాధ్యక్షులు జి వి కొండారెడ్డి, జి వెంకటేశ్వర్లు, సి హెచ్ మొజుందార్, తదితరులు మాట్లాడారు. తొలుత అసోసియేషన్ జెండాను సత్యవతి ఎగురవేశారు. మహాసభ ఇటీవల కాలంలో మరణించిన ఉద్యమ నేతలకు సంతాపం ప్రకటించింది. కార్యక్రమంలో పలు ప్రాజెక్టులకు చెందిన నాయకురాళ్లు పాల్గొన్నారు.

## దాతృత్వానికి దిక్సూచి పాఠశాలలో జలశుద్ధి కేంద్రం, వంటశాల ఏర్పాటు





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఏప్రిల్ 15)

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని పాతూరు ప్రాథమిక పాఠశాలలో స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో మౌలిక వసతులు అభివృద్ధి చెందాయి. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కనిగిరి వాస్తవ్యులు పోతిరెడ్డి సుధీర్ రెడ్డి జ్ఞాపకార్థంగా వారి స్నేహితుడు శివకృష్ణ రూ.70 వేల రూపాయల వ్యయంతో జలశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ1 డివి సుబ్బారావు, ఎంఈఓ2 నారాయణరెడ్డి హాజరై, సుధీర్ రెడ్డి తల్లిదండ్రులు మాలకొండరెడ్డి, ఈశ్వరమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి అధ్యక్షతన శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభించారు. అదేవిధంగా పాతూరుకు చెందిన స్వర్గీయ మోహన్‌రావు, కృపమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారుడు, సేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సుధీర్‌బాబు పాఠశాల ఆవరణలో రూ.30వేల వ్యయంతో వంటశాలను నిర్మించి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాతలను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. దాతల సహకారంతో పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుపడటంతో విద్యార్థులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌కె ఆరిఫా జహాన్, జి శైలజ, కె భ్రమరాంబ, ఎంవి లక్ష్మమ్మ, ఎస్ఎంసి చైర్మన్ సీదా శిరీష, వైస్ చైర్మన్ వరలక్ష్మి, హర్షవర్ధన్, శృతి, పాతూరు నాగ, తల్లిదండ్రులు, స్నేహ హస్తం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

## క్షయ వ్యాధి పై అవగాహన




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15)

ముంగమూరు డొంక యూపీహెచ్ సి పరిధిలో ప్రధాన మంత్రి టిబి ముక్త భారత్ అభియాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా యూపీహెచ్‌సి నుంచి బుధవారం ర్యాలీగా వెళ్లి దగ్గరలో ఉన్న కూడలిలో మానవహారంగా ఏర్పడి క్షయ వ్యాధి పట్ల అవగాహన , జాగ్రత్తలు గురించి తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎవరు అయితే షుగర్ వ్యాధి గ్రస్తులు, 60 సంవత్సరాలు పైన బడిన వారు, పోషకాహార లోపం ఉన్నవారు, మద్యపానం అలవాటు ఉన్నవారు, ధూమపానం అలవాటు ఉన్నవారికి ప్రత్యేకంగా గళ్ళ పరీక్షలు చేస్తామని ప్రజలకు అవగాహన చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీ భార్గవి నర్సింగ్ విద్యార్థులు, టిబి అధికారి డాక్టర్ భానుమతి, టిబి సిబ్బంది, యూపీహెచ్‌సి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పై అవగాహన



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 15)

స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఏపిఎం శ్రీనివాసరావు అధ్యక్షతన సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా ఎస్సై పి సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాల పై, సైబర్ నేరాల పై, ఫేస్బుక్ వాట్సప్ మొదలైన సోషల్ మీడియా యాప్స్ యొక్క ఫేక్ ప్రొఫైల్స్ పెట్టి జరిగే మోసాలపై డ్వాక్రా మహిళలకు తగుచూచనలు సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో ఎస్ఎస్ఎన్ జూయర్ కళాశాల విద్యార్థుల సత్తా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15)

బుధవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ 2026 పరీక్ష ఫలితాలలో ఒంగోలు ముంగమూరు రోడ్లోని ఎస్ఎస్ఎన్ జూయర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో తమ సత్తా ను చూపించారు అని ఎస్ఎస్ఎన్ విద్య సంస్థల అధినేత యల్లటూరి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ ఎంపీసీలో పి జోషిత అత్యధికంగా 989 మార్కులు సాధించినదని, 985 మార్కుల పైన సాధించినవారు 13 మంది విద్యార్థులు ఉన్నారని,అలాగే జూనియర్ ఇంటర్ ఎమ్. పీ. సి లో బీ. శ్రీ ఆదిత్య , పీ. ప్రణితసాయి 466 మార్కులు సాధించారని 460మార్కుల పైన సాధించినవారు మొత్తం 21 మంది విద్యార్థులు ఉన్నారని, జూనియర్ ఇంటర్ బైపీసీలో జే కళ్యాణి 455 మార్కులకు గాను 452 మార్కులు సాధించినదని, 450 మార్కుల పైన సాధించినవారు 9 మంది విద్యార్థులు ఉన్నారని 90% పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిన ఏకైక విద్య సంస్థ గాచీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వై.శివానందరెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాలలో ఎస్ఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని, ఎదురులేని, తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకొని ఇంటర్మీడియట్ విద్యారంగంలో మాకు మేమే సాటి అని, మాకు ఎవరు లేరు పోటీ అని మరొకసారి నిరూపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అత్యధిక మార్కులు పొందిన వారిని కళాశాల డైరెక్టర్ వై సత్యనారాయణరెడ్డి, అకడమిక్ డీన్ ఎమ్ జనార్ధన్‌రెడ్డి, అధ్యాపకులు పీ రఘునాథరెడ్డి, ఎమ్ మధుసూదనరావు, ఎమ్ చెంచురెడ్డి అభినందించారు.






## విశ్రాంత ఉద్యోగ సంఘం మార్కాపురం జిల్లా అధ్యక్షుడిగా రవీంద్రనాథ్‌రెడ్డి ఎన్నిక

(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, ఏప్రిల్ 15)

మార్కాపురం జిల్లా విశ్రాంత ఉద్యోగ సంఘ ఎన్నికలు బుధవారం మార్కాపురం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ ఎన్నికలలో అధ్యక్ష పోటీకి గిద్దలూరుకు చెందిన రవీంద్రనాథరెడ్డి, కంభం కు చెందిన శైలజ పోటీపడ్డారు. ఈ పోటీలో రవీంద్రనాథ్‌రెడ్డికి 50 ఓట్లు రాగా శైలజకు ఏడు ఓట్లు వచ్చినవి. అదే విధంగా అసోసియేట్ ప్రెసిడెంట్‌కు జరిగిన ఎన్నికల్లో ముగ్గురు పోటీ పడ్డారు. వీరిలో మార్కాపురంకు చెందిన చెంచయ్యకు 57 ఓట్లు రాగా, కనిగిరికి చెందిన నాగభూషణంకు 41 ఓట్లు, కంభంకు చెందిన వెంకట్రావుకు 11 ఓట్లు వచ్చాయి. మిగతా స్థానాలకు వైస్ ప్రెసిడెంట్‌గా మార్కాపురంకు చెందిన వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తరువాత కంభంకు చెందిన ప్రసాద్, బేస్తవారిపేటకు చెందిన రమణారెడ్డి ఇద్దరు ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎన్నికయ్యారు. సెక్రటరీలుగా నలుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బేస్తవారిపేటకు చెందిన రంగనాయకులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరందరిని రాష్ట్ర విశ్రాంత ఉద్యోగ సంఘ అధ్యక్షులు పిఎస్ఎస్ఎన్ శాస్త్రి ఘనంగా సన్మానించారు. జనరల్ సెక్రెటరీగా డిపి రామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన శ్రీ వివేకానంద విద్యార్థిని



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 15)

బైపిసి సెకండియర్ విభాగంలో శ్రీ వివేకానంద కళాశాల విద్యార్థిని ఎండి సాహెరా ఫాతిమా 1000 కి 993 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిందని కళాశాల యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెకండ్ ఇయర్ ఎంపీసీ గ్రూపులో బి నందిని 1000 కి 988 మార్కులు సాధించి స్టేట్ ఏడవ ర్యాంకు, 987 మార్కులతో ఎం సాయి కృష్ణ నిరంజన్ 8వ ర్యాంకు సాధించిందన్నారు. అంతే కాకుండా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాలలో ఫస్ట్ ఇయర్ ఎంపీసీ 464 మార్కులతో స్టేట్ 4వ ర్యాంకు, ఎస్కే అఫియా 462 మార్కులు, 460 మార్కులు, అలాగే సీఈసీ గ్రూపులో ఆర్ తిరుపతయ్య 500 కి 480 మార్కులు, షేక్ అలియా సుల్తానా 475 మార్కులు సాధించి శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల విజయకేతన ఎగురవేశారని యాజమాన్యం తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు స్వీట్లు తినిపించి శు భాకాంక్షలు తెలిపారు.

## జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజముల బల ప్రదర్శన కరపత్రము ఆవిష్కరణ

ఆవిష్కరణలో పాల్గొన్న పోతినేని శ్రీనివాసరావు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15)


స్వర్గీయ మండవ వెంకట్రావు మెమోరియల్, పెనుబోతు వీరయ్య చౌదరి ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు వద్దా ఈనెల 20 నుండి 26 వరకు జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజముల బల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం బల ప్రదర్శన కి సంబంధించిన కరపత్రమును నిర్వాహకులు గుమ్మడి సాయిబాబా, పోతినేని శ్రీనివాసరావు (పి.యస్.ఆర్), కామేపల్లి శ్రీనివాసరావు, మిత్ర బృందం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రదర్శన ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుండి స్టార్ట్ అవుతాయని మొదటి బహుమతి 30,000, రెండవ బహుమతి 25,000, మూడవ బహుమతి 20,000, నాలుగో బహుమతి 15,000, ఐదో బహుమతి 12,000, ఆరో బహుమతి 10,000, ఏడో బహుమతి 9,000, ఎనిమిదవ బహుమతి 8,000, 9వ బహుమతి 7000, బహుమతులు ఉంటాయని పోటీల్లో పాల్గొనే ఎట్ల జతల యజమానులకు, రథసారథిలకు ఉచిత భోజన వసతి కలదని తెలిపారు. పూర్తి వివరాలకు 9182548455, 7995683667 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# వైసిపి పాలనలో వేధింపులు కేసులతో కాలం వెళ్లదీశారు






**ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**
**నిరంతర అభివృద్ధి కోసం టిడిపికి మద్దతు ఇవ్వండి**
**మార్టూరు మండలంలో రూ.73.74 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం**
**రూ.65.73 కోట్లతో సోలార్ టాప్‌కు లాంచనంగా ప్రారంభోత్సవం**





**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, ఏప్రిల్ 15)**

వైసిపి ఐదేళ్ల పాలనలో గ్రామాలలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి సంక్షేమాన్ని గాలికి వదిలి వేధింపులు అక్రమ కేసులతో కాలం వెళ్లదీశారని, రెండేళ్ల కాలంలో రెండు దశాబ్దాల సమస్యలను పరిష్కరించామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. బుధవారం మార్టూరు మండల పరిధిలో మార్టూరు మండలంలో రూ.73.74 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ద్వారకాపాడు, వలపర్ల ,మార్టూరు గ్రామాలలో ఎమ్మెల్యే ఏలూరి విస్తృతంగా పర్యటించారు. సోలార్ విద్యుత్ విస్తరణ, గ్రామీణ విద్యుత్ మౌలిక వసతుల బలోపేతం, చేనేత కార్మికుల సంక్షేమం, ఆహార భద్రత వంటి పలు రంగాల్లో ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందన్నారు.ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, నియోజకవర్గాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. సోలార్ విద్యుత్ విస్తరణతో విద్యుత్ స్వయం సమృద్ధి సాధన దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్‌తో జీవనోపాధి బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. =ఖూ పనులతో గ్రామీణ విద్యుత్ వ్యవస్థ బలపడుతుందని, అన్న క్యాంటీన్, అంగన్వాడీలు, రోడ్లతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతున్నాయని పేర్కొన్నారు.

**సోలార్ రూఫ్‌టాప్ పనులు ప్రారంభోత్సవం...** నియోజకవర్గంలో సోలార్ రూఫ్‌టాప్ పథకాన్ని రూ.65.73 కోట్లతో 6,383 మంది లబ్ధిదారులకు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 100 శాతం సబ్సిడీతో 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ యూనిట్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఒక్కో యూనిట్ ఖర్చు రూ.1.25 లక్షలు అవుతుందని వివరించారు. ద్వారకపాడు గ్రామంలో సూర్య ఘర్ యోజన కింద ఇప్పటికే 28 మందికి సోలార్ యూనిట్లు అమలు చేయగా, ఈ రోజు ముగ్గురు లబ్ధిదారుల ఇళ్లలో యూనిట్లను ప్రారంభించారు.పర్చూరు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతున్నాయన్నారు.

**ద్వారకాపాడులో....** ద్వారకపాడు గ్రామంలో రూ.57 లక్షలతో =ఖూ పనులు పూర్తయ్యాయని, 190 కరెంటు స్తంభాలు, 3 ట్రాన్స్‌ఫార్మర్లతో విద్యుత్ వ్యవస్థను మెరుగుపరిచామని చెప్పారు. వలపర్ల గ్రామంలో రూ.2.34 కోట్లతో 950 స్తంభాలు, 5 ట్రాన్స్‌ఫార్మర్లతో విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేసినట్లు తెలిపారు.



**వలపర్ల లో...** వలపర్ల గ్రామంలో రూ.2.34 కోట్లు పనులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించారు. గ్రామంలో రూ.2.09 కోట్లతో 950 కరెంటు స్తంభాలు , రూ.25 లక్షలతో 5 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. వలపర్ల గ్రామంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు 345 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మార్కండేయ నగర్‌లో ఐదుగురు చేనేత కార్మికులకు సర్టిఫికెట్లు జారీ చేసి, మగ్గాల పరిశీలన చేపట్టినట్లు చెప్పారు.

**అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం....** మార్టూరు గ్రామంలో రూ.61 లక్షలతో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించారు. రూ.11.50 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్నీ ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే రూ.3.92 కోట్లతో =ఖూ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, 1,600 స్తంభాలు, 8 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రూ.35 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

**రాంనగర్ లో అంగన్వాడి ప్రారంభం...** మార్టూరు రాంనగర్ లో రూ.11.50 లక్షలతో నిర్మించిన అంగన్వాడి భవనాన్ని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభించారు. అనంతరం పోషణ పక్షవాడా కార్యక్రమం పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలో విద్యార్థులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని ఎమ్మెల్యే ఏలూరి పరిశీలించారు.

## జనగణన పై శిక్షణ కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 15)**

దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో అత్యంత కీలకమైన జనగణన 2027ను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనుండటంతో మండల స్థాయిలో విజయవంతంగా నిర్వహించడానికి అధికార యంత్రాంగం సర్వం సన్నద్ధం చేసేందుకు అమలు చేయాల్సిన విధి విధానాలపై ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. సదరు శిక్షణ కార్యక్రమనికి తహసీల్దార్ జె ప్రభాకరరావు, ఎంపిడిఓ ధనలక్ష్మి, ఎఎస్ఓ శివ ప్రసాద్, శిక్షణ అధికారులు ఎన్ శ్రీనివాసరెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జె ప్రభాకరరావు మాట్లాడుతూ ముదు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం అనతరం రెండవ బ్యాచ్ సోమవారం నుండి బుధవారం వరకు జరగనున్నట్లు తెలిపారు.

## మార్కాపురంలో 18న భారీ ధర్నా




**(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 15)**

మార్కాపురం జిల్లా కేంద్రంలో ఈ నెల 18న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం భారీ స్థాయిలో ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె మల్లికార్జునరావు, జిల్లా కార్యదర్శి రంగస్వామి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, విద్యారంగ సమస్యలు,ఆర్థిక సమస్యలు, సాధారణ సమస్యలతో పలువురు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమన్నారు. ఈ సందర్భంగా కంభం మండల అధ్యక్షుడు మరియు ప్రధాన కార్యదర్శులు భాస్కర్ నాయుడు, త్రివిక్రమ్‌రావు ఈ నెల 18న మార్కాపురం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయడానికి మండలంలోని, ఉపాధ్యాయులు అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు పగడాల పాండు, అబ్దుల్ కలాం మద్దతు తెలుపుతూ, ఉపాధ్యాయ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ధర్నా కార్యక్రమంలో పలు సమస్యలపై నిరసన వ్యక్తం చేయడంతో పాటు, ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. జిల్లాలోని అన్ని మండలాల నుండి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు.

## నర్సిరెడ్డిపల్లి పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో





**(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 15)**

మండలంలోని నర్సిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి అబ్దుల్ సత్తార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, బోధనా విధానం, విద్యార్థుల హాజరు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. పాఠశాలలోని తరగతి గదులు, మౌలిక వసతులు, తాగునీటి సదుపాయం, పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించిన ఎంఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు విధానాన్ని పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని అభినందించారు. అదేవిధంగా విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభ్యసన స్థాయి, పాఠ్యాంశాలపై అవగాహనను పరీక్షించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పద్ధతులు, పాఠ్య ప్రణాళిక అమలు విధానం పట్ల కూడా సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు చూపుతున్న కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు లంకా నరసింహారావు పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు, విద్యార్థుల పురోగతి గురించి వివరించారు. సిఆర్పీ అనురాధ కార్యక్రమంలో పాల్గొని పాఠశాల నిర్వహణకు సంబంధించిన అంశాలను చర్చించారు. పాఠశాల అభివృద్ధి చెందేలా ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి కొనసాగించాలని ఎంఈవో సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా నాణ్యమైన విద్య అందించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన కోరారు.

## ఇంటర్మీడియట్ ఫలితాలలో గౌతమ్ కళాశాల విద్యార్థుల సంచలన ఫలితాలు



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఏప్రిల్ 15)**

బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరాల ఫలితాలలో గౌతమ్ కళాశాల విద్యార్థులు టౌన్ ఫస్ట్ మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఎస్. అంజనా సౌమ్య 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ గా నిలిచారు. ఏ పూజిత 461, టి సౌమ్య 461, డి అలేఖ్య 460, ఏ సాత్విక్ కుమార్‌రెడ్డి 460, వెంకట రూప 458, ఎం ప్రణీత 458, కే పూజిత 458, వి వెంకటనారాయణ 458, కౌశిక 455, షేక్ సాదియా 451, వి మహిత 451 సాధించారు. బైపీసీ విభాగంలో వి వర్షిని 455 మార్కులకు గాను 437 మార్కులు సాధించి టౌన్ సెకండ్ గా నిలిచారు. ప్రథమ సంవత్సరంలో 400 పైన మార్కులు సాధించిన వారు 38మంది. ద్వితీయ సంవత్సర ఫలితాలలో 1000 మార్కులకు గాను మెంటా బాలాజీ మరియు రెడ్డివారి చక్రధర్ 988 మార్కులతో టౌన్ ఫస్ట్‌గా నిలిచారు. ఎస్ ఆర్షియా, పి రిజ్వాన, ఎం ప్రవళిక 987 మార్కులు సాధించారు. ఎస్ఎండి రాషద్ 986 మార్కులు, అభినయ్ 982, బి వరుణ్ 982 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో గుర్రాల దేవి నవ్యశ్రీ 978 మార్కులు సాధించి టౌన్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. 900 పైగా మార్కులు సాధించిన ద్వితీయ సంవత్సర విద్యార్థులు 29 మంది. ఈ విజయానికి కారకులైన విద్యార్థిని, విద్యార్థులకు, అధ్యాపక బృందానికి పత్రికా ముఖంగా గౌతమ్ కళాశాల కరెస్పాండంట్ పంగా సౌజన్యలక్ష్మి, ప్రిన్సిపల్ ఎన్ రవి కుమార్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు.

## అద్దంకి బస్టాండ్‌లో అగ్నిమాపక అవగాహన కార్యక్రమం

**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 15)**

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్నిమాపక అధికారి వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు సూచనలు అందించారు. గ్యాస్ సిలిండర్ లీక్ అయి మంటలు చెలరేగిన సందర్భాల్లో తడి దుప్పటి లేదా బకెట్‌తో కప్పి మంటలను అదుపులోకి తేవచ్చని సిబ్బంది ప్రదర్శన ద్వారా వివరించారు. గ్యాస్ లీక్ సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ స్విచ్‌లు ఆన్ చేయకూడదని హెచ్చరించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి గ్యాస్ పైప్‌ను మార్చుకోవడం మంచిదని వెంకట్రావు సూచించారు. ప్రమాద సమయాల్లో ఆందోళనకు గురికాకుండా చాకచక్యంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.








## ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు కి కృతజ్ఞతలు తెలిపిన కామరాజు గడ్డ కుసుమకుమారి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15)**

ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు ఆశీస్సులతో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో కామరాజుగడ్డ కుసుమకుమారిని రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకి ధన్యవాదాలు తెలిపారు. అలాగే తనకు సహకరిస్తు తన ఉన్నతికి, తన అభ్యున్నతికి తోడ్పడుతున్నటువంటి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుని కుసుమకుమారి దంపతులు కలిసి ధన్యవాదాలు తెలిపారు.

## అనధికార హై బీమ్ లైట్ల పై కఠిన చర్యలు

### రోడ్డు ప్రమాదాల నివారణకు నాగులుప్పలపాడు పోలీసుల ప్రత్యేక డ్రైవ్





(షణ్ముఖ వెలుగు, నాగులుప్పలపాడు, ఏప్రిల్ 15)

ఒంగోలు రూరల్ సర్కిల్ పరిధిలోని నాగులుప్పలపాడు పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతను పెంపొందించేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ట్రాఫిక్ నియమాల అమలులో భాగంగా, అనధికార హై బీమ్ లైట్లు మరియు ఇతర ప్రమాదకర లైటింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఒంగోలు రూరల్ సీఐ శేషగిరిరావు తెలిపారు. బుధవారం నాగులుప్పలపాడు జాతీయ రహదారిపై స్థానిక ఎస్ఐ బిబి మహేంద్ర నాయక్, స్టేషన్ సిబ్బందితో వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శేషగిరిరావు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రమాణాలకు విరుద్ధంగా అధిక కాంతి వెలువరించే లైట్లు వాడటం వల్ల ఎదురుగా వచ్చే వాహనదారులకు దృష్టి మసకబారడం, ప్రమాదాల అవకాశాలు పెరగడం జరుగుతోందని పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేసి, అనధికార లైటింగ్‌ను తొలగించారు. ముఖ్యంగా ఇలాంటి మార్పులు ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ఉండటమే కాకుండా చట్టపరమైన చర్యలకు కారణమవుతాయని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు భద్రతకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హెల్మెట్ ధరించడం, వేగ పరిమితులు పాటించడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్ నివారించడం, రాత్రివేళల్లో లో బీమ్ వినియోగించడం వంటి జాగ్రత్తలు ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు.

## టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నారా లోకేష్‌కు హార్దిక శుభాకాంక్షలు

### ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15)

తెలుగుదేశం పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులైన మంత్రి నారా లోకేష్ సారధ్యంలో టీడీపీ యువ రక్తంతో ముందుకు వెళ్తుంది అన్ని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు పేర్కొన్నారు. దూరదృష్టి గల నాయకుడు నారా చంద్రబాబునాయుడు నాయకత్వ వారసత్వాన్ని అందిపుచ్చుకుని, యువత ఆలోచనలకు దగ్గరగా ఉండే శక్తివంతమైన నాయకుడిగా లోకేష్ ఎదుగుతున్నారు. పార్టీ పట్ల అంకితభావం, ప్రజల పట్ల బాధ్యత ఇవి ఆయన నాయకత్వానికి అసలైన బలం. విద్యాశాఖలో ఆధునిక మార్పులు, డిజిటల్ విద్య ప్రోత్సాహం, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత పెంపు వంటి భవిష్యత్ తరాలకు బలమైన పునాది వేస్తున్నారు. ఐటీ రంగంలో పెట్టుబడులు, యువతకు ఉపాధి అవకాశాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాయి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేస్తూ, కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలుస్తున్న ఆయన నాయకత్వం తెలుగుదేశం పార్టీకి మరింత శక్తిని, విజయాన్ని అందించాలి తెలిపారు.

## జనాభా గణన శిక్షణ తరగతులు నిర్వహణ




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 15)

ఉలవపాడు మండలం లో గవర్నమెంటు హై స్కూల్ నందు జన గణన-2027 లో భాగంగా రెండవ బ్యాచ్ ఎనిమిరేటర్లు,, సూపర్వైజర్‌లకు 15న ఇండ్ల జాబితా గణన పై శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సెన్సస్ చార్జి ఆఫీసర్ అయిన తహశీల్దార్ ఏవి రవి శంకర్ హాజరైన ఎనిమిరేటర్లు, సూపర్వైజర్ లకు సూచనలు అందించారు. సకాలంలో గణన పూర్తి చేయాలని సూచించారు. సెన్సస్ షెడ్యూల్ ప్రకారం శిక్షణా తరగతులు ఉదయం, మధ్యాహ్నం ఫీల్డ్ ట్రైనర్‌లు పున్నేపల్లి శ్రీనివాసులు, షేక్ బాజ్జీ ఎనిమిరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎనిమిరేటర్లు, సూపర్వైజర్లు యొక్క విధి విధానాలు, హెచ్ఎల్ఓ యాప్ మ్యాప్‌లు, హెచ్ఎల్ఓ బ్లాక్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ఏఎస్ఓ పుష్పలత హాజరయ్యారు.

# బద్వేల్ ప్రజలకు అందుబాటులోకి

# సరికొత్త 'వీరభద్ర' కళ్యాణ మండపం

## భక్తిశ్రద్ధలతో ముగిసిన హోమాలు, సత్యనారాయణ స్వామి వ్రతం





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఏప్రిల్ 15)

బద్వేల్ మున్సిపాలిటీ పరిధి పోరుమామిళ్ల రోడ్డు బద్వేల్ పట్టణ ఆధ్యాత్మిక వైభవంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. పోరుమామిళ్ల రోడ్డులో వెలసిన ప్రసిద్ధ శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపం భక్తులకు, సామాన్య ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.గతంలో ఇక్కడ ఉన్న కళ్యాణ మండపం భక్తుల అవసరాలకు చిన్నదిగా ఉండేది. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఆలయ కమిటీ సభ్యులు పక్కనే ఉన్న స్థలాన్ని కలుపుకొని, విశాలమైన స్థలంలో సర్వాంగ సుందరంగా ఈ నూతన మండపాన్ని పునర్నిర్మించారు. గతంతో పోలిస్తే ఇప్పుడు ఎక్కువ మంది అతిథులు కూర్చునేలా నిర్మాణం చేపట్టారు. ముఖ్యంగా పట్టణంలోని పేద, మధ్యతరగతి ఆర్యవైశ్యులకు తమ ఇంట్లోని శుభకార్యాలను తక్కువ ఖర్చుతో, దైవ సన్నిధిలో జరుపుకోవాలనే ఉద్దేశంతో కళ్యాణ మండపాన్ని ఆలయ కమిటీ సభ్యులు దాతల సహకారంతో ఈ ఏర్పాటు చేశారు.

**శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు :** నూతన మండప ప్రారంభం సందర్భంగా గత 3, రోజులుగా దేవాలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అత్యంత భక్తిశ్రద్ధలతో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. బుధవారం శ్రీ రమాదేవి సహిత శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం ఉత్సవాల్లో శ్రీ రమాదేవి సత్యనారాయణ స్వామి వ్రతాన్ని వైభవంగా జరిపారు. లోక కళ్యాణార్థం, భక్తుల సౌభాగ్యం కోరి నిర్వహించిన ఈ వ్రతంలో కమిటీ సభ్యులు మరియు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ప్రొద్దుటూరు కిషోర్ కుమార్ ఆలయ ప్రెసిడెంట్ దేవతి సురేంద్ర, వడ్లపూడి నాగభూషణం, తెలివిది లక్ష్మణ్ గుప్తా మదనపల్లె సత్యనారాయణ మరియు పలువురి కమిటీ సభ్యులు మాట్లాడుతూ బద్వేల్ ఆర్యవైశ్యులకు , ముఖ్యంగా సామాన్యులకు తక్కువ ధరకే శుభకార్యాలు చేసుకునే వీలు కల్పించడమే మా ప్రధాన ఉద్దేశం అన్నారు. వీరభద్ర స్వామి ఆశీస్సులతో ఈ నూతన మండపం ఎన్నో మంగళకరమైన వేడుకలకు వేదిక కావాలని కోరుకుంటున్నామన్నారు. ఈ నూతన కళ్యాణ మండపం అందుబాటులోకి రావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భక్తితో పాటు సేవా దృక్పథాన్ని చాటుకున్న ఆలయ కమిటీ కృషిని అందరూ అభినందిస్తున్నారు. ఈ ప్రారంభోత్సవంలో శ్రీకాకుళం వెంకటసుబ్బయ్య, పత్తి రాజా గారి కృష్ణమూర్తి, పబ్బతి సత్యనారాయణ తుమ్మలపెంట వెంకటసుబ్బయ్య బెస్తమల్ల శివకుమార్, ఓలేటి రమణ, చిప్పగిరి ఆంజనేయులు పబ్బతి సాయి, సొల్లేటి సుబ్బరాజా తో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారస్తులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాలలో శ్రీ ప్రతిభ విజయ దుందుభి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15)




ఇంటర్ ఫలితాలలో శ్రీ ప్రతిభ విద్యాసంస్థల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఆనుమోలు అంజన 1000 మార్కులు గాను 991 మార్కు లు, మాకినేని మనోజ్ 990, ఎర్రావుల బ్రహ్మారెడ్డి 990, ఎక్కండి హేమ వర్షిని 990 మార్కులు సాధించారు. అలాగే బైపిసి విభాగంలో పిన్నిక సంతోషిని 988, దాసరి వైశాలి 987, ఏనుగంటి నాగనందిని 987 సాధించారు. 990 కి పైగా మార్కులు విద్యార్థులు, 980 కి పైగా మార్కులను 65 మంది విద్యార్థులు, 970 పైగా మార్కులను 110 మంది విద్యార్థులు, 960 కి పైగా మార్కులను 140 మంది విద్యార్థులు సాధించినట్లు విద్యా సంస్థలు చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే జూనియర్ ఇంటర్ విభాగంలో 470 మార్కులకు గాను వి కార్తీక్ రెడ్డి 467, కొరివి సత్య భవ్య శ్రీ 466, వేల్పుల చంద్రహాసిని 466, జంపు మంజుల 466, ఆలమూరు ప్రవీణ 465, కే హర్షిత 465, పట్నం వెంకట మౌనిక 465 మార్కులను సాధించారు. అలాగే బైపిసి విభాగంలో ఓ అక్షర 450 మార్కులు, కొప్పోలు దివ్య సాహిత్య 449 మార్కులు, తన్నీరు అశ్విత 448 మార్కులు, చెరుకుపల్లి లోకేశ్వరి 445 మార్కులు, పి రామ్ చరణ్ తేజ 444, ఏ విష్ణువర్ధన్ 44 4మార్కులు సాధించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులను సాధించిన విద్యార్థులను విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లుడి జయప్రకాష్ నారాయణ విద్యార్థులను అభినందించారు.

# ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ









(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 15)

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షల్లో స్థానిక ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. పొన్నలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం బైపీసీలో తన్నీరు శ్రీవల్లి, తన్నీరు స్వాతి 455/446 మార్కులు సాధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. ద్వితీయ సంవత్సరంలో సీఈసీలో కాటా మధురవాణి 1000/939 మార్కులు సాధించి ప్రభుత్వ కళాశాలలో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. వీరిని ప్రిన్సిపల్ రాజేంద్ర బాబు, అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు.

## ఉలవపాడు సెక్టార్ పరిధిలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం






(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 15)

మండల కేంద్రమైన ఉలవపాడు1 సెక్టార్ పరిధిలోని అంగన్వాడి కేంద్రంలో బుధవారం సిడిపిఓ డి మాధవి లత ఆదేశాల మేరకు సూపర్వైజర్ కె.రమాదేవి ఆధ్వర్యంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా 18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల స్త్రీలకు మీటింగ్ ఏర్పాటు చేసి మార్కెట్లో దొరికే ఫుడ్ పాకెట్స్ కురుకురేలు, లేస్ ప్యాకెట్స్ వాడరాదని ఇంటిలోనే సాంప్రదాయ కరమైన వంటలు తయారు చేసి పెట్టవలెను. ఏఎన్ఎంలు వెయ్యి రోజుల ప్రాముఖ్యత గురించి వివరించారు 0-2 టైంలో పిల్లల ఎదుగుదల ఎలా, ఏమిటి అని వివరించారు. అంగన్వాడి కార్యకర్త అంగన్వాడీలో ఇచ్చే బాలమృతం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కె రమాదేవి, అంగన్వాడీ కార్యకర్త ఎస్ హేమలత, గర్భవతులు, తల్లులు, ఏఎన్ఎంలు డి పద్మ, శారద, ఆశాలు పాల్గొన్నారు.

## పేకాట శిబిరం పై దాడి



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 15)

మండలంలోని వెల్లటూరు ఎస్సీ కాలనీ సమీపంలో బుధవారం పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులని పోలీసులు అదుపులో తీసుకున్నారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి వారి వద్ద నుండి 1650 నగదు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనపరుచుకున్నారు. ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# ఎరుపుమయమైన ఒంగోలు
# ఘనంగా ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ 28వ రాష్ట్ర మహాసభ




**ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు తక్షణ పరిష్కారం చేయాలి**
**పీపీపీ విధానంలో ప్రైవేట్ విద్యుత్ బస్సుల ప్రవేశం నిలిపివేయాలి**
**పెండింగ్ డిఏ, 11వ పీఆర్సీ అరియర్స్ వెంటనే చెల్లించాలి**
**నూతన రాష్ట్ర కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**
**జ్యోతి ప్రజ్వలన చేసిన మంత్రి స్వామి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**
**మాట్లాడిన పలిశెట్టి, ఈశ్వరయ్య**
**మహాసభలకు హాజరైన ఆర్టీసీ ఉద్యోగులు**









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15) ఒంగోలు పట్టణంలోని బృందావన్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం జరిగిన ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ 28వ రాష్ట్ర మహాసభ ఘనంగా జరిగింది. యూనియన్ 75వ వార్షికోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ మహాసభలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 129 డిపోలు, నాలుగు నాన్-




ఆపరేషన్ యూనిట్ల నుండి సుమారు 8,000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. మహాసభలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల బాల వీరాంజనేయ స్వామి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకత్వం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రధానంగా ప్రస్తావించారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు పెండింగ్‌లో ఉన్న డి.ఏ బకాయిలు వెంటనే చెల్లించాలి 11వ పీఆర్సీకి సంబంధించిన 24 నెలల అరియర్స్ విడుదల చేయాలని, ఎన్నికల హామీ మేరకు ఇంటరిమ్ రిలీఫ్ ప్రకటించి 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, పీపీపీ విధానంలో ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశాన్ని నిలిపివేయాలని, స్త్రీ శక్తి పథకంలోని ఇబ్బందులను పరిష్కరించాలని, సంస్థలో ఖాళీగా ఉన్న సుమారు 8,000 పోస్టులను తక్షణం భర్తీ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ స్త్రీ శక్తి ఉచిత ప్రయాణ పథకాన్ని విజయవంతం చేయడంలో ఆర్టీసీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అయితే ఈ పథకం అమలులో




పనిభారం పెరిగి సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు, పీఆర్సీ అరియర్స్ చెల్లింపులపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశానికి హాజరైన సాంఘిక, సంక్షేమ, సచివాలయశాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. హాజరైన ప్రముఖులు ఈ మహాసభలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్) కె.యస్. బ్రహ్మానందరెడ్డి, ఆర్.యం సత్యనారాయణ, జోనల్ చైర్మన్ ఎస్. సురేష్ రెడ్డి, డి.యం జి.



శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య, ఏఐటీయూసీ నాయకులు రావులపల్లి రవీంద్రనాథ్, ఎస్. వెంకటసుబ్బయ్య, ఏపీ జేఏసీ నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, పనిపేర్రాజు తదితరులు హాజరయ్యారు.

**నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక**

ఈ మహాసభలో యూనియన్ నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా పలిశెట్టి, జీవి నూతన రాష్ట్ర అధ్యక్షులు గా పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శిగా జి.వి. నరసయ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గా పి. సుబ్రమణ్యంరాజు, అడిషనల్ జనరల్ సెక్రెటరీగా ఎం.డీ. ప్రసాద్ ఉప ప్రధాన కార్యదర్శిగా ఆవుల ప్రభాకర్, జి.నారాయణరావు, పి, బానుమూర్తి తో పాటు మరో 45 మందిని రాష్ట్ర కమిటీ లో వివిద హో దాల్లో నియమించారు. మహాసభ ప్రారంభానికి ముందు సుమారు 8,000 మంది ప్రతినిధులతో ఒంగోలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించడం విశేషం.

# చట్టసభల్లో మహిళా గళం పెరిగితే దేశానికే బలం
# యాగంటి మల్లికార్జునరావు



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఏప్రిల్ 15) చట్ట సభలలో మహిళ గళం పెరిగితే దేశానికే బలం పెరుగుతుందని మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు అన్నారు. ఈ సందర్భంగా యాగంటి మల్లికార్జున రావు మాట్లాడుతూ పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాం ఎన్డీఏ ప్రభుత్వం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం. మహిళల ఆర్థిక స్వాలంభనే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం మూడు రోజులు జరగనున్న పార్లమెంటు సమావేశాలలో మహిళ రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పెంపు కు ఆమోదం తెలపాలి. అన్ని రంగాలలో పురుషులతో సమానంగా మహిళలకు ఎన్డీఏ ప్రభుత్వం పెద్దపీట మహిళలకు రాజ్యాధికారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిర్ణయం. తెలుగుదేశం పార్టీలో మహిళలకు మొదటి నుంచి అగ్ర తాంబూలమే. ఆపరేషన్ సింధూర్‌తో మహిళల సత్తాను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదే.

నారీ శక్తితో ఎన్డీఏ ప్రభుత్వం మహిళలకు మరోసారి పెద్దపీట వేసింది. అన్ని రాజకీయ పార్టీలు వ్యక్తిగత విషయాలు పక్కన పెట్టి చట్టసభల్లో మహిళ రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాం. ఏ ప్రభుత్వం కూడా మహిళలకు ఇవ్వని 33 శాతం రిజర్వేషన్ ను ఎన్డీఏ ప్రభుత్వం కల్పించడం హర్షణీయం. తమ నాయకుడు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును స్వాగతిస్తుంది. తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి మహిళలకు పెద్దపీట వేసి వారి అభివృద్ధికి బాటలు వేసింది. అలాగే విద్య, వైద్య, శాస్త్ర సాంకేతిక, వ్యవసాయ, క్రీడా, యుద్ధ రంగాలలో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తూ తమ సత్తాను ఇప్పటికే చాటుకున్నారు. ఇప్పటికే మహిళా తల్లులు తమ సత్తాను చాటి ప్రపంచానికి సగర్వంగా నిలవడం అభినందనీయం. అలాంటి మహిళా తల్లులకు చట్టసభల్లో మాట్లాడే అవకాశాన్ని కల్పించి నారీ గళాన్ని దశ దిశల వ్యాప్తి చెందేలా ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేయాలని కోరుతున్నాం. తమ నాయకుడు సీఎం చంద్రబాబు నేతృత్వంలో నియోజకవర్గాల పెంపు వంటి బృహత్తర నిర్ణయం తీసుకోవడం ఎంతో గర్వకారణం. తద్వారా రాష్ట్రంలో పరిపాలన, అభివృద్ధి, సంక్షేమం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. కావున పార్లమెంటు సమావేశాలలో నియోజకవర్గాల పెంపునకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరుతున్నాం. కావున 16, 17, 18 తేదీలలో జరగనున్న పార్లమెంటు సమావేశాలలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి మద్దతు తెలపాలని కోరుతున్నాం. మహిళల రాజ్యాధికారమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని తెలియజేసుకుంటున్నాం.

# భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలి
## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 15) ఒంగోలు నియోజకవర్గ పరిధిలో వున్న భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ హాల్లో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావుతో కలిసి కార్పొరేషన్, రెవెన్యూ అధికారులతో సమావేశమై ఒంగోలు నియోజకవర్గ పరిధిలో నెలకొని వున్న పలు భూ సమస్యలపై సమీక్షించి, సమస్యల పరిష్కార పురోగతిపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు ఇళ్ళ పట్టాల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే ఒంగోలు నియోజకవర్గ పరిధిలో వున్న భూ సమస్యల పై ప్రత్యేక దృష్టి సారించి వాటిని సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల అవసరాలకు ఉపయోగ పడేలా అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఒంగోలు నగరంలో పేదలకు ఇళ్ళ నిర్మాణాలకు నిర్దేశించిన లే అవుట్స్‌లో పేదలు త్వరగా ఇల్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఈ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మున్సిపల్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, జిల్లా రిజిస్ట్రార్ బాలంజనేయులు, ఒంగోలు అర్బన్ తహసిల్దార్ మధుసూదన్‌రావు, నగర కార్పోరేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మందుబాబులకు జరిమానా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15) ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వుల మేరకు విజిబుల్ పోలీసింగ్ , వాహన తనిఖీలలో భాగంగా ఒంగోలు ట్రాఫిక్ పోలీస్ వారు చెక్ చేస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో 28 మందిని బుధవారం గౌరవ కోర్టు వారి వద్ద హాజరు పరచగా 25 మందికి ఒక్కరికి రూ.10వేలు చొప్పున రూ.2,50,000లు జరిమానా, ముగ్గురికి 3 రోజులు జైలు శిక్ష విధించారని ఒంగోలు ట్రాఫిక్ సీఐ జగదీష్ ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలు నడపరాదని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, వాహనాలను అతి వేగంగా నడపరాదని, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, వాహనదారులందరూ ఎంవీ యాక్ట్ రూల్స్ పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.

# సిద్ధార్థ విద్యార్థుల ప్రభంజనం

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 15)

బుధవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాలలో సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ద్వితీయ సంవత్సరం ఫలితాలలో బైపిసి విభాగంలో వి స్వాతి 1000 మార్కులకు గాను 988 మార్కులు సాధించి మార్కాపురం జిల్లా స్థాయిలో సెకండ్ ర్యాంక్ కైవసం చేసుకుంది. ఎంపీసీ విభాగంలో సిహెచ్ ఇందు 1000 మార్కులకు గాను 986 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో సెకండ్ ర్యాంకు సాధించడం జరిగింది. ఎంఇసి విభాగంలో 1000 మార్కులకు గాను 947 మార్పులు తో జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకును సాధించడం జరిగింది. వీరితో పాటు అనేక మంది విద్యార్థులు 900 కు పైగా మార్కులు సాధించడం జరిగింది. అదే విధంగా ప్రథమ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ విభాగంలో కె ఈశ్వర్ 470 కి గాను 458 మార్కులు అదేవిధంగా బైపిసి విభాగంలో ఈ యశ్వంత్ 455మార్కులకు గాను 428 మార్కులు సీఈసీ విభాగంలో డి రమాకాంత్ రెడ్డి 500 కి 424 మార్కులు సాధించడం జరిగింది. వీరితోపాటు అనేకమంది 400 పైగా మార్కులు సాధించడం జరిగింది ఈ మార్కులు సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని కళాశాల చైర్మన్ గోలమారి వెంకటనారాయణరెడ్డి మిఠాయిలు తినిపించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గోలమారి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె సుబ్బారెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి శంకర్‌రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కొండయ్య




(షణ్ముఖ వెలుగు, చీరాల, ఏప్రిల్ 15)

తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్‌కు చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువ నాయకుడిగా లోకేష్ చూపిస్తున్న క్రమశిక్షణ, కృషి, అంకితభావం పార్టీకి కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని పేర్కొన్నారు. లోకేష్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతూ, రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తల్లో నూతనోత్సాహం పెరుగుతుందని అన్నారు. ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించే దిశగా పార్టీ ముందుకు సాగుతుందని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం స్పష్టమైన దూరదృష్టితో లోకేష్ ముందుకు సాగుతున్నారని కొనియాడిన ఎమ్మెల్యే కొండయ్య, యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఆయన సారథ్యంలో పార్టీ మరిన్ని విజయాలు సాధించి, ప్రజల ఆశలు నెరవేర్చాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. లోకేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# జనాభా భాగస్వాములు కావాలి
# తహసిల్దార్ పుల్లారావు

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 15)

మండలంలో జనాభా గణన మే 1 నుండి వినూత్న పద్ధతిలో ప్రారంభమవుతుందని తహసిల్దార్ వి పుల్లారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు తెలిపారు. మొదటి దశలో ఇండ్ల గణన పూర్తి చేస్తారు. ఏప్రిల్ 16 నుండి 30 వరకు టెక్నాలజీ తెలిసిన వారు ఆన్లైన్లో వివరాలు స్వయంగా నమోదు చేసుకోవచ్చు. అనంతరం ఐడి నంబర్ ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్లకు ఇవ్వాలి అన్నారు.

## ఇంటర్ ఫలితాలలో శ్రీ సరస్వతి ప్రభంజనం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15)

ఇంటర్ ఫలితాలలో ఒంగోలులోని మంగమూరు రోడ్డులో గల శ్రీ సరస్వతి విద్యా సంస్థల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారు. ఎంపీసీ జూనియర్ ఇంటర్ విభాగంలో 470 మార్కులు గాను డి జశ్విత 467 మార్కులు, ఎం.వి నాగసత్య భవ్య శ్రీ 467, బి హర్షిని 467, వివిఎన్ మహేశ్వరి 467, ఎన్.వి చంద్రలేఖ 467, టి త్రినాథ్ చౌదరి 467, పి నాగరాజు 467, బైపీసీ విభాగంలో డి వైష్ణవి 455 మార్కులు 452, ఎంఈసి విభాగంలో పి ఫాతిమా సుల్తానా 500 మార్కులకు గాను 490, సి ఈ సి విభాగంలో ఎన్ సాయి సహస్ర 500 మార్కులు గాను 488 మార్కులు సాధించారు. అలాగే సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో కె అంజనీ రేవంత్ 1000 మార్కులకు 991, షేక్ అబ్దుల్ జుబీర్ 991, ఎం బాల వైష్ణవి 991, ఏ చార్మిల 991, బైపీసీ విభాగంలో పి ఖాదర్ భి 991 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శ్రీ సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఏవి రమణారెడ్డి, డైరెక్టర్లు ఏ గణేష్‌రెడ్డి, ఏ గంగా శంకర్‌రెడ్డి, డీన్స్, ప్రిన్సిపల్స్, అధ్యాపక బృందం అభినందించారు.

## చలివేంద్రం ప్రారంభం






(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 15)

మండలంలోని కే అగ్రహారం గ్రామంలో పొన్నలూరు వ్యవసాయ శాఖ డీలర్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి వి రాము మాట్లాడుతూ వేసవికాలంలో ఎల్ నీనొ ప్రభావం వలన ఎండల త్రివ్రత ఎక్కువగా జులై వరకు ఉంటుందని తెలిపారు. రైతులు ప్రజలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు అత్యవసర పరిస్థితిలో తప్ప బయటకు రావద్దని సూచించారు. ఎండలకు డిహైడ్రేషన్ భారీన పడకుండా మజ్జిగ, నీరు, నిమ్మరసం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ కృష్ణయ్య, నాయకులు పిల్లి కృష్ణారెడ్డి, పి వాసు,ఎరువుల డీలర్స్ పల్నాటి వెంకటేశ్వర రెడ్డి, పల్లపోతు సురేష్ బాబు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పాత సామాన్లకు వేలం పాట

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15)

ప్రకాశం జిల్లా డిస్ట్రిక్ట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ నందు గల తీసి వేయబడిన పాత సామానులైన అల్యూమినియం వంట పాత్రలు, ఇనుప సామానులు, పాత కుర్చీలు, ఐరన్ , ప్లాస్టిక్ టేబుల్స్, ఎలెక్ట్రికల్ వస్తువులు, కంప్యూటర్ వస్తువులు ఇతరత్రాల పై ఈ నెల 17వ తేదీన వేలం వేయడం జరుగుతుందని జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్ కార్యాలయ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బడునని తెలిపారు. పాత సామాన్లను "వేలం" ద్వారా పాడుకోదలచిన వారు ప్రకాశం జిల్లా డిస్ట్రిక్ట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్, కొత్తమామిడిపాలెం రోడ్ నందు 16వ తేదీ ఉదయం 10 గంటలకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వేలం" పాటలో పాల్గొనదలచినవారు 9121102270 నెంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

## ఫెయిల్ అయిన విద్యార్థులు నిరుత్సాహ పడవద్దు


### పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్




(షణ్ముఖ వెలుగు, పామూరు, ఏప్రిల్ 15)

బుధవార ఇంటర్ పరీక్ష ఫలితాలు విడుదలైన సందర్భంగా సీఐ వినోద్ కుమార్ ఫెయిన్ అయిన విద్యార్థుల గురించి మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షల్లో ఫెయిల్ అయినా నిరుత్సాహపడకూడదన్నారు. ఆత్మహత్యల వంటి నిర్ణయాలు తీసుకోవడం పిరికితనం అన్నారు. గెలుపోటములు సహజమని, ఓటమితో కృంగిపోకుండా మళ్లీ పట్టుదలతో ప్రయత్నించాలని విద్యార్థులకు ఆయన సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని కష్టపడి చదివి మంచి భవిష్యత్తు సాధించాలని సీఐ వినోద్ కుమార్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. పాసైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# కనిగిరి ఆర్‌టీసీ డిపోలో శుద్ధ జల కేంద్రం ప్రారంభం






(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఏప్రిల్ 15)

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో కనిగిరి ఆర్‌టీసీ డిపోలో బీద మస్తాన్ రావు చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శుద్ధ జల కేంద్రం ను బుధవారం ఏపియస్‌ఆర్‌టిసి నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించడం ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఎంతో అవసరమని తెలిపారు. ఈ శుద్ధ జల కేంద్రం ద్వారా ఆర్‌టీసీ డిపోకు వచ్చే ప్రయాణికులు, సిబ్బంది సురక్షితమైన నీటిని వినియోగించుకోగలరని తెలిపారు. కనిగిరి ఆర్‌టీసీ డిపోలో ఏర్పాటు చేసిన ఈ శుద్ధ జల కేంద్రం ప్రయాణికులు, సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని ఆదా చేస్తూ, ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా అన్ని డిపోలు అభివృద్ధి చేయుటలో ప్రయాణికులకు సౌకర్యాలు సహకారాలు అందించడంలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం మాట్లాడుతూ కనిగిరి ఆర్‌టీసీ డిపోకు రోజూ వచ్చే ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని బీద మస్తాన్ రావు చారిటబుల్ ట్రస్ట్ అందించిన సహకారం అభినందనీయమని అన్నారు. ఈ కేంద్రం ద్వారా సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి రావడం వల్ల ప్రయాణికులకు ఎంతో ఉపశమనం కలుగుతుందని ప్రజలు ఈ సదుపాయాన్ని జాగ్రత్తగా ఉపయోగించి, నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం భారతరత్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి వారోత్సవాలు లో భాగంగా ఉద్యోగులను, శానిటేషన్ సిబ్బందిని, హమాలీలను, గ్యారేజ్ సిబ్బందిని ఘనంగా సన్మానం చేసినారు. ఈ కార్యక్రమంలో కనిగిరి, పామూరు పట్టణ బిజెపి నాయకులు, డిపో ఉద్యోగులు, ఆర్‌టిసి వివిధ విభాగాల సిబ్బంది, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ రాష్ట్ర కార్యదర్శులుగా గునుపూడి, మీగడ





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 15)

తెలుగుదేశం పార్టీ నూతన రాష్ట్ర కమిటీని బుధవారం నియమించింది. అందులో భాగంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా తొలి సారిగా పొదిలి పట్టణానికి చెందిన ఇద్దరు సీనియర్ నాయకులను నియమిస్తూ కేంద్ర టీడీపీ పార్టీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. మొన్నటి వరకు టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా పని చేసిన ఆర్యవైశ్య నాయకుడు గునుపూడి భాస్కర్‌కు మరో సారి రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా పొదిలి మండల మాజీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డిని కూడా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఇస్తుందనేందుకు నిదర్శనంగా ఈ పదవుల పంపకం జరిగిందని పార్టీ నాయకులు చెబుతున్నారు. ఒకే ఊరిలో ఇద్దరికి రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర కార్యదర్శులుగా ఎంపిక చేయడం ఇదే ప్రథమం.. ఈ సందర్భంగా వారిరువురు మీడియాతో మాట్లాడుతూ తమకు ఈ పదవులు వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి, తమ పై బాధ్యతలు పెంచుతూ ఈ పదవులు అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఇతర పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తమ పై పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ముకానివ్వమని వారు తెలిపారు. 2029లో పార్టీ గెలుపుకు తమ వంతు కష్టపడి పని చేసి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

# అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 15)

అగ్నిమాపక వారోత్సవాలు 2026లో భాగంగా బుధవారం ఒంగోలులోని ఏపీఎస్‌ఆర్టీసీ బస్ గ్యారేజ్ నందు పనిచేయు సిబ్బందికి ఆయిల్స్ వలన అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా నివారించాలో డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. బస్సుల యందు అగ్ని నిరోధక పరికరములు ఉంచుకోవాలని సూచించారు. బస్టాండ్ ఆవరణలో ఉన్న ప్రయాణికులకు, సిబ్బందికి అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన తెలియపరిచే కరపత్రాలు పంపిణీ చేయడమైనది. ఈ కార్యక్రమం నందు డిపో మేనేజర్ జి శ్రీనివాసరావు, గ్యారేజ్ ఇంచార్జ్ ఎస్ విజయ, జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి కె శ్రీకాంత్ రెడ్డి, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.






## మండల పార్టీ అధ్యక్షుడుకి మాతృ వియోగం నివాళులర్పించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఏప్రిల్ 15)

రాచర్ల మండల పార్టీ అధ్యక్షుడు కటిక యోగానంద్ తల్లి కటిక రంగ లక్ష్మమ్మ (టీచర్) అనారోగ్యం కారణంగా బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వారి నివాసం వద్దకు వెళ్ళి ఆమె భౌతిక ఖాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబ పెద్దగా తల్లిని కోల్పోవడం దురదృష్టకరమని, ధైర్యంగా ఉండాలని యోగానంద్, కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నంది శ్రీనివాసులు, గోడి ఓబుల్‌రెడ్డి, అంబవరం శ్రీనివాసరెడ్డి, దుత్తా బాల ఈశ్వరయ్య, గోపిరెడ్డి జీవనేశ్వర్‌రెడ్డి, అబ్బు ఓబయ్య, నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

నివాళులర్పించిన

షణ్ముఖ వెలుగు దినపత్రిక యాజమాన్యం : రాచర్ల మండల పార్టీ అధ్యక్షులు కటిక యోగానంద్ తల్లి కటిక రంగలక్ష్మమ్మ అకాల మరణం పట్ల షణ్ముఖ వెలుగు దినపత్రిక ఎడిటర్ రాధాకృష్ణ, గిద్దలూరు ఇన్‌ఛార్జి శివపురం మురళీకృష్ణ నివాళులర్పించారు.

## మోసం చేసి ఆత్మహత్యకు దారితీసిన ఘటనలో నిందితుడు గుంటూరి మేరి బాబుఅరెస్ట్




(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 15)

పొదిలి పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలన ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుడిని మోసం చేసి, ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ సూరెడ్డి రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం మండంలోని రాములవీడు గ్రామానికి చెందిన గుంటూరి మేరి బాబు పొదిలి మండలంలోని ఉన్నగురవాయపాలెం గ్రామానికి చెందిన అన్నవరపు పేరిరెడ్డి అనారోగ్య పరిస్థితిని అవకాశంగా తీసుకున్నాడు. పక్షవాతంతో బాధపడుతున్న పేరిరెడ్డి కుటుంబానికి సహాయం చేస్తానని నమ్మబలికి, అతని భార్య వెంకట శ్రావణి వద్ద నుంచి ఇంటి పత్రాలు, చెక్కులు, బ్యాంక్ పాస్‌బుక్ తీసుకున్నాడు. ఆ తర్వాత ఒంగోలులోని ఈక్విటీ ఫైనాన్స్ ద్వారా పేరిరెడ్డి భార్య పేరు పై ఇల్లు మార్ట్‌గేజ్ చేసి రూ.8 లక్షల లోన్ తీసుకొని స్వప్రయోజనాలకు వినియోగించుకున్నాడు. అలాగే మరొక మహిళను కూడా మోసం చేసి, ఆమె పేరు పై ఇంటిని మార్చి చోలమండల ఫైనాన్స్ ఆఫీస్ ద్వారా మరో లోన్ తీసుకొని దానిని కూడా సొంతానికి వాడుకున్నాడు. ఈ విషయం పై పేరిరెడ్డి పలుమార్లు ప్రశ్నించగా నిందితుడు దూషిస్తూ "మీరు చచ్చిపోతే ఇన్సూరెన్స్ వల్ల లోన్ తీరిపోతుంది" అంటూ బెదిరించినట్లు ఎస్ఐ తెలిపారు. దీంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన పేరిరెడ్డి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మార్చి 27న మరణించాడు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి ఏప్రిల్ 14 రాత్రి బుచ్చనపాలెం అడ్డరోడ్ వద్ద నిందితుడిని అరెస్టు చేశామన్నారు. నిందితుడు ఇదే తరహాలో మరికొంత మందిని కూడా మోసం చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## చిన్నారుల పట్ల శ్రద్ధ చూపాలి సూపర్‌వైజర్ సుమతి




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఏప్రిల్ 15)

భావిభారత పౌరులైన చిన్నారుల పట్ల శ్రద్ధ చూపాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుమతి అన్నారు. పోషణ – పక్వాడ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని 4వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడారు. 0 – 6 సంవత్సరాల లోపు పిల్లలు, గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పొందాలన్నారు. చిన్నారులు ఫోన్లు, టీవీల పై వారి ప్రభావం పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. చిన్న పిల్లలను ఆట పాటల ద్వారా వారిలో మేథాశక్తిని పెంచేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సెల్‌ఫోన్లు, టీవీలతో పిల్లలు చెడుమార్గం వైపు పయనిస్తున్నారని, దానికి ప్రారంభ దశలోనే అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పై ఉందన్నారు. కొవ్వు పదార్థాలతో పాటు చెక్కర, ఉప్పును తగ్గించి ఆకుకూరలు, పాలు, పండ్లుతో పాటు పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు ఆహారంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మగవారికి వంటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్తలు పి అనురాధ, ఎస్‌కె రిజ్వానా, ఆశా వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.